
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY



వశిష్ఠకు తగ్గిన వరద

రేపటి నుంచి రాకపోకల పునరుద్ధరణ



నరసాపురం టౌన్/ఆచంట, సెప్టెంబరు 14 : వశిష్ఠ గోదావరికి శనివారం వరద తగ్గుముఖం పట్టింది. ఎగువ ప్రాంతం నుంచి రెండు లక్షల క్యూసెక్కుల నీటిని మాత్రమే సముద్రంలోకి విడిచి పెట్టడంతో రేవుల్లో నీరు లాగుతోంది. ఆదివారానికి సాధారణ పరిస్థితి నెలకొంటే సోమవారం నుంచి సఖినేటిపల్లి- మాధవాయిపాలెం రేవుల వద్ద పంటు రాకపోకల్ని కొనసాగిస్తారు. శనివారం నరసాపురం, యలమంచిలి మండలాల్లోని వరద కారణంగా మూసివేసిన స్లూయిస్ తలుపులను తీశారు. ఆచంట మండలం లంక గ్రామాల్లో నీట మునిగిన పల్లపు ప్రాంతాలు, పుష్కర ఘాట్‌లు బయట పడుతున్నాయి.

పాఠశాలల ల్యాప్‌టాప్‌లు వెనక్కి..

భీమవరం రూరల్, సెప్టెంబరు 14 : జిల్లాలోని 140 ప్రభుత్వ ఉన్నత పాఠశాలలకు 2019లో ఇచ్చిన ల్యాప్‌ట్యాప్‌లను జిల్లా విద్యాశాఖాధికారులు తిరిగి తీసుకున్నారు. వివిధ కార్యక్రమాలకు వీటిని వినియోగిస్తున్నారు. ప్రస్తుత అవసరాలకు అనుగుణంగా ఇవి ఉపయోగంలో లేకపోవడంతో అప్‌డేట్ చేసి తిరిగి ఇవ్వనున్నారు. దీనివల్ల ఉపాధ్యాయులకు, పాఠశాల నిర్వహణకు మరింత ఉపయోగకరం కానున్నాయి.

దిగుమతి సుంకం పెరిగిందంటున్న వ్యాపారులు.. పండుగల వేళ ప్రజలపై భారం

వంట నూనెల ధరలు సలసల

పామాయిల్, సన్‌ఫ్లవర్ ఆయిల్స్‌పై లీటరుకు రూ.20 పెంపు



పాలకొల్లు, సెప్టెంబరు 14 : సామాన్యుడి నెత్తిన మరో భారం పడింది. వంట నూనెల ధరలు కాక పుట్టిస్తున్నాయి. రెండు రోజుల వ్యవధిలో పామాయిల్, సన్‌ఫ్లవర్ ఆయిల్స్ లీటరుకు 20 రూపాయల చొప్పున పెరిగాయి. నిన్నటి వరకు పామాయిల్ లీటర్ రూ.90 నుంచి రూ.95 వుండగా, రూ.110 నుంచి రూ.115కు, రిఫైన్డ్ సన్‌ఫ్లవర్ ఆయిల్ రూ.112 నుంచి 133కు పెరిగింది. ఈ పెంపుదల కారణంగా ప్రతి కుటుంబంపై నెలకు వంద రూపాయల వరకు భారం పడుతుంది. ఇతర దేశాల నుంచి చౌకగా దిగుమతి అవుతున్న కారణంగా దేశీయంగా నూనె గింజల ధరలు పడిపోతున్నాయి. ఈ పరిస్థితులలో దేశీయ రైతులకు ప్రయోజనం చేకూర్చేందుకు కేంద్రం విదేశీ వంట నూనెలపై సుంకం పెంచింది. ఇప్పటి వరకు ముడి పామాయిల్, సన్ ఫ్లవర్, సోయా బీన్‌లపై దిగుమతి సుంకం లేదు. దీనిని 20 శాతం పెంచుతున్నట్టు కేంద్రం ప్రకటించింది. రిఫైన్డ్ పామాయిల్ తదితర నూనెలపై 12.5 శాతంగా వున్న దిగుమతి సుంకాన్ని 32.5 శాతానికి పెంచింది. వీటికితోడు అగ్రికల్చరల్ సెస్ అదనంగా కలుస్తోంది. ఈ పెంపుతో దిగుమతులు తగ్గి, దేశీయంగా ఉత్పత్తి అయ్యే వంట నూనెల ధరలకు డిమాండ్ పెరుగుతుందనేది కేంద్రం ఆలోచన. సెస్ బూచిని చూపి మార్కెట్‌లో వ్యాపారులు నూనె ధరలను విపరీతంగా పెంచేస్తున్నారు.

ఇండోనేషియా, మలేషియా దేశాల నుంచి మనకు పామాయిల్ దిగుమతి అవుతుండగా, రష్యా, అర్జంటీనా, ఉక్రెయిన్ దేశాల నుంచి సన్‌ఫ్లవర్ ఆయిల్ దిగుమతి అవుతోంది. ఇప్పుడు దిగమతి సుంకం పెంపుతో ఆయా ఆయిల్ ధరలు పెంచడానికి మాఫియా వర్గాలు రంగం సిద్ధం చేసుకుంటున్నాయి. ఉమ్మడి జిల్లాలో సుమారు నెలకు సరిపడా వంట నూనెల ఉత్పత్తులను టోకు వర్తకులు నిల్వ చేసి ఉంచుతారు. దిగుమతి సుంకాన్ని పెంచుతూ కేంద్రం నిర్ణయంతీసుకున్న వెంటనే లీటరు వంట నూనెపై రూ.10 పెంచి ఇప్పుడు తాజాగా రూ.20కు తీసుకువచ్చారు.

పండుగల ముందు దెబ్బ

హిందువుల తొలి పండుగ వినాయకచవితితో మొదలై సంక్రాంతి వరకు పలు పండుగలకు పిండి వంటలకు అధికంగా వంట నూనెలు వినియోగిస్తారు. వచ్చే 3, 4 నెలల్లో దసరా, దీపావళి, క్రిస్మస్, సంక్రాంతి వంటి పండుగ దినాలు ఉన్నాయి. ఈ పరిస్థితుల్లో వంట నూనెల ధరలు గరిష్ఠ స్థాయికి తీసుకుపోతారని వినియోగదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మార్కెట్ నిల్వలపై సంబంధిత అధికారులు తనిఖీలు నిర్వహించి వంట నూనెల ధరలు స్థిరీకరించాలని గృహిణులు కోరుతున్నారు. వంట నూనెల ధరలు పెరిగితే పరోక్షంగా అన్ని ఆహార ధరలు పెరుగుతాయని ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికే ఫలహారశాలలో రెండు ఇడ్లీ రూ.30, దోసె రూ.40కి పెరిగింది. వంట నూనెల పెరుగుదల బూచితో ధరలు పెంచివేస్తారని భావిస్తున్నారు.

మండలానికో డ్రోన్

- 80 శాతం రాయితీపై సరఫరా
- మహిళా లబ్ధిదారుల గుర్తింపునకు కసరత్తు
- పురుగు మందులు చల్లేందుకు వినియోగం



డ్రోన్ వినియోగాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ నాగరాణి

(భీమవరం-ఆంధ్రజ్యోతి)

వ్యవసాయ రంగంలో మహిళలకు ప్రాధాన్యత ఇచ్చేలా కూటమి ప్రభుత్వం నిర్ణయాలు తీసుకుంది. ఆక్వా, వరి, ఉద్యాన పంటల్లో పురుగు మందుల పిచికారి కోసం డ్రోన్‌లను వినియోగించనుంది. మండలానికి ఒక డ్రోన్ మంజూరుచేయనుంది. రెండు నెలల్లో ప్రక్రియను పూర్తి చేయాలని ఆదేశాలు జారీచేసింది. గ్రామీణాభివృద్ధి, వ్యవసాయ, ఉద్యానవన శాఖలకు ఈ బాధ్యతలను అప్పగించింది. మహిళలకే డ్రోన్‌లను అందించి, పిచికారి విధానంపై శిక్షణ ఇవ్వనున్నారు. ఇందుకు మండలంలో ఇద్దరు విద్యావంతులను గుర్తించనున్నారు. డ్రోన్ కోసం ప్రభుత్వం రూ.10 లక్షలు మంజూరు చేస్తోంది. ఇందులో ఎనిమిది లక్షలు రాయితీ, రెండు లక్షలు బ్యాంకు రుణం మంజూరు చేస్తారు. డ్రోన్‌ను తీసుకువెళ్ళేందుకు ట్రాలీతోపాటు పొలంలో ఎగుర వేసేందుకు అవసరమైన పరికరాలను అందిస్తారు. దీనిపై ఇప్పటికే జిల్లా కలెక్టర్ నాగరాణి సమీక్ష నిర్వహించారు. మహిళలను గుర్తించే బాధ్యతను అధికారులకు అప్పగించారు. కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలు పిచికారిపై శిక్షణ ఇస్తారు. ఆక్వాలోను డ్రోనుల వినియోగంపై ప్రభుత్వం దృష్టి పెట్టింది. ఇటీవల పాలకొల్లులో డ్రోన్ ద్వారా మందులను పిచికారి చేసి విజయవంతమయ్యారు. వాస్తవానికి వరి సాగులో కోత, నాటు యంత్రాలను వినియోగిస్తున్నారు. దీనివల్ల సాగు సులభతరమైంది. పెట్టుబడి తగ్గింది. డ్రోన్‌ల ద్వారా ఇప్పుడు పురుగు మందులు పిచికారి చేసి తక్కువ మోతాదు ఎక్కువ ఫలితాలు సాధించే అవకాశం ఉంది.



కంపోస్టుయార్డు వద్దంటూ ఆందోళన

పురుగుల మందు డబ్బాలతో మంగళగుంటపాలెం గ్రామస్థుల ధర్నా, రాస్తారోకో.. హైవేపై బైఠాయింపు

నరసాపురం, సెప్టెంబరు 14 : మున్సిపాలిటీ కంపోస్టుయార్డును తొలగించాలంటూ మంగళగుంటపాలెం గ్రామస్థులు శనివారం నాలుగు గంటలపాటు ధర్నా, రాస్తారోకో చేశారు. గత ప్రభుత్వ హయాంలో కంపోస్టు యార్డు కోసం పట్టణ శివారునున్న మంగళగుంటపాలెంలో నాలుగు ఎకరాలు సేకరించారు. నోటిఫికేషన్ ఇచ్చినప్పుడే రైతులు ఆందోళనకు చేసి తాత్కాలికంగా విరమించారు. కూటమి ప్రభుత్వం రైతులకు రూ.1.74 కోట్ల బకాయిలను విడుదల చేసినట్లు ఎమ్మెల్యే నాయకర్ శుక్రవారం ఆర్డీవో అంబరీష్‌తో కలిసి ప్రకటించారు. త్వరలో రైతులకు సొమ్ము చెల్లించి కంపోస్టు యార్డును తరలిస్తామని చెప్పారు. సమస్య మొదటికొచ్చిందని భావించిన గ్రామస్థులు పెద్ద సంఖ్యలో సబ్ కలెక్టర్ కార్యాలయం వద్ద పురుగుల మందు డబ్బాలతో తరలివచ్చారు. పరిస్థితి ఉద్రిక్తంగా మారడంతో ఆర్డీవో అంబరీష్ వారితో చర్చలు జరిపారు. సరైన హామీ లేకపోవడంతో గ్రామస్థులు 216 జాతీయ రహదారిపై బైఠాయించి రాస్తారోకో చేశారు. ఎమ్మెల్యే నాయకర్ వచ్చి హామీ ఇస్తేగాని ఆందోళన విరమించమని భీష్మించారు. పట్టణంలోని చెత్తను తమ గ్రామంలో వేయడాన్ని తాము ఒప్పుకునేది లేదని, పొలాల మధ్య కంపోస్టు యార్డు పెడితే భూమి విలువలు పడిపోతాయని మాజీ ఉప సర్పంచ్ కాసా సత్యనారాయణ అన్నారు. ట్రాఫిక్ స్థంభించడంతో సీఐ యాదగిరి, ఎస్ఐ ముత్యాలరావు గ్రామస్థులతో చర్చలు జరిపారు. ఎమ్మెల్యే స్థానికంగా లేరని, ప్రయాణికుల ఇబ్బందులను పరిగణనలోకి తీసుకుని ఆందోళనను విరమించాలని కోరడంతో తాత్కాలికంగా వాయిదా వేశారు. గ్రామస్థులు త్రిమూర్తులు, వెంకటేశ్వర్లు, రమేష్, దుర్గా, సీతమహాలక్ష్మి, భానులు పాల్గొన్నారు.

కొత్త సరుకు రావాల్సిందే



కొత్త మద్యం విధానం కోసం అందరూ పడిగాపులే. పాత సరుకు పోయి ఏ తరహాలో తాము కోరుకుంటున్న సరుకు వస్తుందా.. రాదా అనే టెన్షనే. మద్యం దుకాణాలు చేజిక్కించుకునేందుకు ఎన్నడూ బయటకు రాని వ్యక్తులు సిండికేట్ల రూపంలో ప్రత్యక్షం. ఇప్పటికే ఈ రంగంలో ఆరితేరిన వారంతా ఈ విషయంలో అమీ తుమీ తేల్చుకోవాలనే ఆతృత. ఇప్పటికే జగన్ సర్కార్ ప్రవేశపెట్టిన మాల్స్‌లో సరుకు క్రమేపీ తగ్గించేశారు. ప్రభుత్వ మద్యం దుకాణాల్లో కొన్ని మాత్రమే అందుబాటులో ఉంచుతున్నారు. ఇప్పుడు ఎవరిని కదిపినా గత టీడీపీ హయాంలో ఉన్న విధానమే తిరిగి రాబోతుందన్న తహతహ.

నూతన ఎక్సైజ్ విధానంపై ఉత్కంఠ

- ఏం జరగబోతుందో తెలుసుకోవడానికే అత్యధికుల ఆసక్తి
- 'జే' బ్రాండ్‌లు పోయి కొత్త బ్రాండ్‌లు రావాల్సిందే
- మద్యం దుకాణాల సంఖ్య పెరగబోతోందంటూ ప్రచారం
- ఈ వ్యాపారం వైపు తొంగి చూస్తున్న కొత్త ముఖాలు
- ఇప్పటికే దుకాణాలు తమ ఆధీనంలో ఉండేలా ఎత్తుగడలు
- ప్రస్తుతం మాల్స్, దుకాణాల్లో మూడొంతులు తగ్గిన స్టాక్

(ఏలూరు/భీమవరం క్రైం-ఆంధ్రజ్యోతి ప్రతినిధి):

మరో రెండు వారాల్లోనే కొత్త మద్యం విధానం రాష్ట్రం ఎదుట సాక్షాత్కరించబోతుంది. మద్యం ప్రియులంతా ఈ విధానంపైనే ఎదురు చూస్తున్నారు. తాము ఆశించినట్టుగా 2019 ముందు వరకు ఉన్న మద్యం సరుకు అంత తిరిగి మార్కెట్‌లోకి తిరిగివస్తుందని భావిస్తున్నారు. ఉమ్మడి జిల్లాలు కొత్త జిల్లాలుగా విడిపోయిన తర్వాత జిల్లా ప్రాతిపదికనే దుకాణాలు పెంచడం, లేదా తగ్గించడం జరుగుతుందని ఇప్పటికే ఒక స్పష్టత వచ్చేసినట్టు ప్రచారం. పశ్చిమ గోదావరి జిల్లాలో గత ప్రభుత్వం 202 ప్రభుత్వ మద్యం దుకాణాలు, 25 బార్లను ఏర్పాటు చేసింది. వీటిల్లో రోజుకు సగటున రూ.నాలు గు కోట్ల వరకు విక్రయాలు సాగుతున్నాయి. ప్రైవేటు వ్యక్తులు దుకాణాలు ఏర్పాటు చేస్తే రోజుకు రూ.6 కోట్ల వరకు విక్రయాలు జరిగే అవకాశం వుంది. సూపర్‌బజార్‌ను తలపించే మాల్స్‌కు శ్రీకారం చుట్టి అమ్మకాల ఒరవడిని పెంచింది. కొత్త మద్యం విధానంలో ఈ మాల్స్‌కు మంగళం పాడబోతున్నారంటూ ప్రచారం. దానికి తగ్గట్టుగానే గడిచిన 45 రోజులుగా మాల్స్‌లో ఇంతకు ముందున్న సరుకు విడుదల కాస్తా ఈ మధ్యన పూర్తిగా తగ్గించివేశారు. వాస్తవానికి జగన్ హయాంలో మద్యపాన నిషేధం పేరిట హడావుడి చేసి చివరకు ఎడాపెడా రకరకాల బ్రాండ్‌లను మార్కెట్‌లోకి చొప్పించి మద్యం ప్రియులకు బలవంతంగా అంటగట్టారు. దీనికితోడు ఏ రోజుకారోజు కష్టపడి కూలీనాలి చేసుకునే వారికి సైతం 120, 130 రూపాయల రకాలు వద్దన్నా అంటకట్టారు. ఇదే నగరాలతోపాటు గ్రామాల్లోను వందలాది మంది యువకుల ప్రాణాలు గాలిలో కలిసేలా చేశాయంటూ ఆరోపణలు. ఇలాంటి పరిస్థితుల్లో కొత్త మద్యం పాలసీలో ఎక్కడికక్కడ దుకాణాల సంఖ్యను పెంచడం, గతంలో మాదిరిగానే ఇవన్నీ ప్రభుత్వం నిర్వహించే వేలం పాటల్లో దక్కించుకున్న ప్రైవేటు వ్యక్తులు నిర్వహించే పరిస్థితులు ఈసారి కూడా తిరిగి పునరావృతం అయ్యేలా ఉన్నాయి. అయితే గతంలో మద్యం దుకాణాలకు నిర్వహించే వేలంలో నాన్ రిఫండ్ పేరిట ప్రతి దుకాణంకు రూ.లక్ష ఉండగా, ఈసారి అది రూ.రెండు లక్షలకు పెంచబోతున్నారు. ఎవరైతే వేలం పాటలో పాల్గొంటారో వారంతా ప్రభుత్వం నిర్దేశించిన దరావత్తును విధిగా చెల్లించాలి. దుకాణం దక్కినా, దక్కకపోయినా ఈ దరావత్తు సొమ్ము ప్రభుత్వ ఖాతాలోనే జమ అవుతుంది. సరిగ్గా ఆ విధానాన్నే ఈసారి పాటించబోతున్నట్టు చెబుతున్నారు. జగన్ హయాంలో ఎవరూ చూడని, వినని దాదాపు 22 రకాల బ్రాండ్‌లన్నీ వచ్చిపడ్డాయి. ఇప్పుడావన్నీ మాయమవుతాయి. ఆ స్థానంలో అందరూ కోరుకునే బ్రాండ్‌లకే ప్రాధాన్యత ఇవ్వబోతున్నట్టు చెబుతున్నారు.



కొత్త ముఖాల ఆతృత

కొత్త మద్యం విధానం ఇప్పటి వరకు ప్రకటించలేదు. అయినా మద్యం వ్యాపారంతో ఎలాంటి సంబంధం లేని వ్యక్తులు ఈసారి రంగంలోకి దిగి దుకాణాలను చేజిక్కించుకోవాలని ఆతృతతో ఉన్నారు. ఇంతకు ముందు కేవలం ఒక సామాజిక వర్గానికి చెందిన వ్యక్తులే మద్యం వ్యాపారంలో కాస్తంత పెట్టుబడులు పెట్టేవారు. కాని ఈసారి అటువంటి వారికి దీటుగా ఐదుగురి నుంచి పది మంది వరకు ఒక సిండికేట్‌గా మారి తమ ప్రాంతంలో దుకాణాల వేలంలో పాల్గొనాలని ఆతృత పడుతున్నారు. ఏలూరు, భీమవరంతోపాటు మిగిలిన నియోజకవర్గ కేంద్రాల్లోను కొన్ని దుకాణాలను గుర్తించి అవి తమ ఆధీనంలోనే ఉండేలా ఇప్పటికే ఎత్తుగడలు వేస్తున్నారు. స్థానిక ఎమ్మెల్యేతో పనిలేకుండా ముందుగా రంగంలోకి దిగడం, ఆ తరువాతే ఎమ్మెల్యేతోపాటు ఇతర నేతలను సంప్రదించాలని భావిస్తున్న వారు లేకపోలేదు. ఏలూరు నగరంలో దుకాణాల సంఖ్య ఈసారి 25కుపైగానే ఉంటాయని అంచనా వేస్తున్న ఇంకొందరు ఆ దిశగానే రంగం సిద్ధం చేసుకుంటున్నారు. ఇంకొందరు సిండికేట్‌గా మారి ప్రతీ దుకాణంలోను తమ వాటా ఉండేలా ఎత్తుగడలకు కత్తులు నూరుతున్నారు.

కొత్త సరుకుతో పాత రోజులు..

కొత్త మద్యం విధానంపై మద్యం వ్యాపారులే కాకుండా సాధారణ జనం తెగ టెన్షన్ పడిపోతున్నారు. జగన్ ప్రభుత్వ హయాంలో కొన్ని బ్రాండ్‌లు పూర్తిగా అదృశ్యమైన విషయాన్ని గుర్తు చేస్తూనే కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత అయినా అందరూ ఆశించినట్టుగా కొత్త బ్రాండ్‌లు మళ్ళీ రోడ్డుక్కుతాయన్న భావనతో లొట్టలేస్తున్నవారూ లేకపోలేదు. ఇంతకు ముందు కనపడని ఇంపీరియల్ బ్లూ, ఎంసీ విస్కీ వంటి రకాలన్నీ ఇప్పటికే స్టాక్ పాయింట్లకు చేరుకున్నాయి. అన్నిటికంటేమించి ఇప్పటికే ప్రభుత్వం మద్యం దుకాణాల్లో సరుకు అంతటిని పూర్తిగా తగ్గించివేశారు. మాన్షన్‌హౌస్ బ్రాండ్ రకాలు పూర్తిగా మాయమైపోయాయి. ఆఖరుకి మాల్స్‌లోనూ ఇదే తరహా పరిస్థితి. వారం రోజులుగా మాల్స్ అన్నింటికీ రోజూ ఇచ్చే స్టాక్స్ శాతాన్ని మూడొంతులు తగ్గించేశారు. దీనిని బట్టి చూస్తే కొత్త పాలసీలో మాల్స్‌లు ఉంటాయా, లేదా అనేది ఇప్పుడు ప్రధాన చర్చగా మారింది. ఇదే తరుణంలో దుకాణాల్లోను కేవలం రెండు, మూడు రకాల బ్రాండ్‌లను మాత్రమే ఉంచి అమ్మకాలు సాగిస్తున్నారు. కొన్ని బ్రాండ్‌లు ఉన్నా అవి అమ్మకానికి వీలుగా స్కాన్ కావడం లేదని పక్కన పెట్టేస్తున్నారు. బీరు విషయానికి వచ్చేసరికి పేరొందిన బీరు కంపెనీల బ్రాండ్‌లన్నీ బార్‌లలో పుష్కలంగా లభిస్తున్నాయి. అదే దుకాణాల్లో మాల్స్‌లో మాత్రం మచ్చుకైనా కనిపించడం లేదని మద్యం ప్రియులు తీవ్ర ఆగ్రహంతోనే ఉన్నారు.



జగన్ సర్కార్ తప్పిదాలతో అన్నీ ఇబ్బందులే

నాసిరకం మద్యంతోనే గంజాయి, డ్రగ్స్ వినియోగం అధికం

ఎక్సైజ్ శాఖ జిల్లా అసిస్టెంట్ కమిషనర్ ప్రభుకుమార్

భీమవరం క్రైం, సెప్టెంబరు 14 : 'వైసీపీ ప్రభుత్వ తప్పిదాలతో అనేక ఇబ్బందులు ఎదురయ్యాయి. ఎవరిని సంప్రదించకుండా అర్ధరాత్రి చీకటి జీవోతో సెబ్‌ను ఏర్పాటు చేసి ఎక్సైజ్ శాఖను నిర్వీర్యం చేశారు' అని జిల్లా ఎక్సైజ్ శాఖ అసిస్టెంట్ కమిషనర్ కేవీఎస్ ప్రభుకుమార్ అన్నారు. గత ప్రభుత్వం ఏర్పాటు చేసిన స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో(సెబ్)ను రద్దు చేసి ఎక్సైజ్ శాఖగా పునరీకరణ చేసి శుక్రవారం రాత్రి ఎన్డీఏ ప్రభుత్వం జీవో విడుదల చేసిన సందర్భంగా ఎక్సైజ్ శాఖ అధికారులు హర్షం వ్యక్తం చేశారు. శనివారం జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్‌శాఖ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సీఎం చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మద్యం రేట్లు పెంచడంతో ఇతర రాష్ట్రాల మద్యం విచ్చలవిడిగా ఆంధ్రాలోకి వచ్చింది. నాసిరకం మద్యం, అధిక ధరలతో గంజాయి, డ్రగ్స్‌ను విచ్చలవిడిగా యువత ఉపయోగించింది. ఇలా అన్ని రకాలుగా నష్టం జరిగింది. ఇప్పుడు నూతన ప్రభుత్వం సెబ్‌ను రద్దు చేయడం హర్షణీయం' అని అన్నారు. ఎక్సైజ్ శాఖ అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరిండెంట్ ఆర్.చిరంజీవి, చిట్టిబాబు, సీఐలు నూకరాజు, కాత్యాయని, భవాని తదితరులు పాల్గొన్నారు.

ఉద్యానం వికసించాలి..!

- వర్సిటీ నూతన వీసీ ముందు సవాళ్లు
- గత తప్పిదాలను సంస్కరించాలి
- నూతన పరిశోధనలపై దృష్టి పెట్టాలి
- విద్యార్థుల సమస్యలను పరిష్కరించాలి

తాడేపల్లిగూడెం రూరల్, సెప్టెంబరు 14 : ఐదేళ్లుగా అస్తవ్యస్తంగా మారిన డాక్టర్ వైఎస్ఆర్ ఉద్యాన విశ్వ విద్యాలయం పూర్వ వైభవం సంతరించుకుంటుందా ? గత ఉప కులపతిపై జగన్ సర్కారు భజన, సత్కారాలు తప్ప చేసిందేమి లేదనే విమర్శలున్నాయి. గత పాలకుల తప్పిదాలు వర్సిటీ ప్రతిష్టను దిగజార్చారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో వర్సిటీ ప్రక్షాళనకు నడుం బిగించింది. వైసీపీ ప్రభుత్వ పెద్దలను ప్రసన్నం చేసుకుని అడ్డదారిలో జానకిరామ్ రెండోసారి వీసీగా పదవి దక్కించుకున్నారు. అయితే కోర్టు ఆదేశాల మేరకు ఆయనను తొలగించారు. వర్సిటీలో పరిశోధన రంగంలో సీనియర్, అనంతరాజులు పేట ఉద్యాన కళాశాల అసోసియేటెడ్ డీన్ కురుబ గోపాల్‌ను ఇన్‌చార్జ్ వీసీగా నియమించారు. ఇక విద్య, పరిశోధన రంగాలతోపాటు పరిపాలన విభాగాల్లో చేయాల్సిన మార్పులపై ఆయన దృష్టి సారించారు. అందులో భాగంగా ఉప కులపతి గోపాల్ తన కొత్త టీంను సిద్ధం చేసుకున్నారు.

కొత్త టీం రెడీ

గత ప్రభుత్వంలో అన్ని విభాగాల్లో ఇన్‌చార్జ్‌లుగా పని చేసిన వారి స్థానంలో కొత్త వీసీ వేరే వారిని నియమించుకోవడంపై దృష్టి పెట్టారు. ఇందులో భాగంగా ఇన్‌చార్జ్ విస్తరణ సంచాలకులుగా తిరుపతి జిల్లా పెరియవరం కేవికే ప్రధాన శాస్త్రవేత్త బి.గోవిందరాజులు ను, ఇన్‌చార్జ్ డీన్ ఆఫ్ పీజీ స్టడీస్‌గా అన్నమయ్య జిల్లా అనంతరాజులుపేట పరిశోధన కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త కేటీ వెంకటరమణను, ఇన్‌చార్జ్ కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్‌గా పార్వతీపురం ఉద్యాన కళాశాల అసోసియేట్ డీన్ బి.ప్రసన్నకుమార్‌ను నియమించారు. వీరితోపాటు వర్సిటీ గ్రంథ పాలకుడిగా కొవ్వూరు పరిశోధన కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త రామానందంను, అంతర్జాతీయ కార్యక్రమాల సంచాలకుడిగా దర్శి పరిశోధన కేంద్రం కె.ధనుంజయరావులను నియమించారు.

నిర్వహణ నుంచి విద్యుత్తు వరకూ

ఉద్యాన విశ్వ విద్యాలయ పరిధిలోని కళాశాల, సిబ్బంది క్వార్టర్స్ నుంచి విద్యార్థుల హాస్టల్స్ వరకూ నిర్వహణపైన గత పాలకులు నిర్లక్ష్యంగా వ్యవహరించారు. దీనికి తోడు విద్యార్థుల హాస్టల్స్‌కు అత్యవసర విద్యుత్తు సమస్య లేకుండా ఏర్పాటు చేసిన జనరేటర్‌కు కూడా మరమ్మతులు చేయకపోవడంతో విద్యార్థులు నిద్ర లేని రాత్రులు గడపాల్సి వచ్చింది. పరిశోధనలు, విద్యాభివృద్ధిని గాలికి వదిలేశారు. వీటిపై కొత్త వీసీ దృష్టి సారించాలి.

జీతాల సమస్య తీరింది

డిప్యుటేషన్‌పై వచ్చి వర్సిటీ కంప్ట్రోలర్‌గా విధులు నిర్వహిస్తున్న శశికళ ఈ ఏడాది మార్చి నుంచి సెలవుపై వెళ్లడంతో వర్సిటీ పరిధిలోని పరిశోధన స్థానాల అధికారులు, ఉద్యోగులు జీతాలందక ఇబ్బంది పడ్డారు. తాజాగా వచ్చిన కొత్త ఇన్‌చార్జ్ వీసీ గోపాల్ ఆమెను మాతృశాఖకు సరెండర్ చేయడంతో సిబ్బంది జీతాల సమస్య తీరింది. శశికళ గతం నుంచి కొనుగోలు చేసిన ఫర్నీచర్ లెక్కలు తేలాల్సి ఉంది.



అన్నింటిని గాడిన పెడతా : వీసీ

డాక్టర్ వైఎస్ఆర్ ఉద్యాన విశ్వ విద్యాలయ పరిధిలోని విద్య విస్తరణ, పరిశోధన అంశాలపై దృష్టి సారిస్తామని ఇన్‌చార్జ్ ఉపకులపతి డాక్టర్ కె.గోపాల్ వివరించారు. వీటితోపాటు అంతర్గతంగా వున్న పోస్టుల భర్తీ నుంచి విద్యార్థులు సమస్యల పరిష్కరిస్తామన్నారు. పరిశోధన పరంగా వర్సిటీ దేశంలోనే ప్రముఖ స్థానంలో నిలిపే విధంగా కృషి చేస్తామన్నారు.

ఎత్తుకు పైఎత్తులు

భీమవరంలో ఉత్సాహంగా అంతర్జాతీయ చెస్ పోటీలు

భీమవరం అర్బన్, సెప్టెంబరు 14: పశ్చిమగోదావరి జిల్లా చెస్ అసోసియేషన్, అనసూయ చెస్ అకాడమీల ఆధ్వర్యంలో అంతర్జాతీయ 1600లోపు రేటింగ్ ఉన్న చెస్ క్రీడాకారులకు అంతర్జాతీయ స్థాయి పోటీలు భీమవవరంలో రెండో రోజులుగా జరుగుతున్నాయి. పోటీలలో 25 రాష్ట్రాల నుంచి ఇంటర్నేషనల్ రేటింగ్ ఉన్న 405 మంది చెస్ క్రీడాకారులు పాల్గొన్నారు. వీరిలో కొంత మంది 'ఆంధ్రజ్యోతి'తో తమ అభిప్రాయాలను పంచుకున్నారు.

గ్రాండ్ మాస్టర్ సాధిస్తా : ఎ.సాయిదివ్య, గుంటూరు



మూడేళ్లుగా చెస్ ఆడుతున్నా. అండర్ 15లో ఇంటర్నేషనల్ రేటింగ్‌లో 1511వ స్థానంలో ఉన్నా. 2023లో తమిళనాడులో జరిగిన జాతీయస్థాయి పోటీలో మొదటి స్థానంలో నిలిచా. ఇప్పటి వరుకు రాష్ట్రస్థాయిలో 8, జిల్లా స్థాయిలో 15 వరకు బహుమతులు సాధించా. రానున్న రోజులలో చెస్ గ్రాండ్ మాస్టర్ టైటిల్ సాధించలన్నదే లక్ష్యం.

చెస్‌లో మరింతగా రాణించాలి : వి.రాధాకుమారి, భీమవరం



చిన్నప్పటి నుంచి చెస్ అంటే ఇష్టం. అప్పట్లో నేర్చుకోవడం కుదరలేదు. ఇప్పుడు పిల్లలకు నేర్పించాలనే ఉద్దేశంతో చెస్ నేర్చుకుని ఇంటర్నేషనల్ స్థాయిలో చెస్ ఆడుతున్నా. ప్రస్తుతం భీమవరం ఎల్ఐసీలో సీనియర్ అసిస్టెంటుగా పనిచేస్తున్నా. 2013లో భోపాల్‌లో జరిగిన ఆలిండియా ఎల్ఐసీ గ్రాండ్ పోటీలలో 3వ స్థానంలో నిలిచా. ఎల్ఐసీ జోనల్ స్థాయి పోటీలలో రెండుసార్లు మొదటి స్థానంలో నిలిచా. చెస్‌లో మరింత ఉన్నత శిఖరాలకు చేరాలన్నదే నా లక్ష్యం.

చెస్ చాలా ఇష్టం : శ్రీకర్ సంతోష్, మహారాష్ట్ర



మేధాశక్తిని పెంపొందించే చెస్ క్రీడ అంటే చాలా ఇష్టం. ప్రభుత్వ ఉద్యోగం కోసం ప్రిపేర్ అవుతూ ఇంటర్నేషనల్ చెస్‌పోటీలు ఆడుతున్నాను. చెస్ క్రీడలో దేశం గర్వించే మంచి క్రీడాకారుడ్ని కావాలన్నదే లక్ష్యం. ప్రస్తుతం 1566 నా ఇంటర్నేషనల్ రేటింగ్. 2019లో మహారాష్ట్రలో జరిగిన రాష్ట్రస్థాయి పోటీలలో మొదటి స్థానంలో నిలిచాను.

స్వశక్తితో చెస్‌లో రాణిస్తున్నా.. : రాకేష్ గౌడ్, కర్నాటక



ఎవరి దగ్గర కోచింగ్ తీసుకోకుండా స్వశక్తితో చెస్‌లో ఇంటర్నేషనల్ క్రీడాకారుడిగా ఎదిగా. ఎంఎస్సీ సైకాలజీ చదివాను. ప్రస్తుతం కర్నాటకలోని మాండ్య జిల్లాలో చెస్ కోచ్‌గా పనిచేస్తున్నాను. 2018లో తెలంగాణలో జరిగిన జాతీయ స్థాయి చెస్ పోటీలలో 3వ స్థానంలో నిలిచాను.

నేత్రపర్వం... ఏకాదశి ఉత్సవం



ద్వారకాతిరుమల, సెప్టెంబరు 14: శ్రీవారి ఏకాదశి ఉత్సవం క్షేత్రపురవీధుల్లో శనివారం రాత్రి ఘనంగా జరిగింది. ముందుగా ఆలయంలో తొళక్క వాహనంపై స్వామి,అమ్మవార్లను ఉంచి అర్చకలు ప్రత్యేక పుష్పాలంకరణ చేశారు. అనంతరం ఆలయ ప్రధానరాజగోపురం మీదుగా మేళతాళాలు మంగళవాయిద్యాల నడుమ స్వామివారి వాహనం క్షేత్రతిరువీధులకు బయలుదేరింది. ప్రతీ ఇంటి ముందు స్వామి, అమ్మవార్లకు భక్తులు హారతులు పట్టారు.

యథావిధిగా అమ్మవారి దర్శనాలు

బుట్టాయగూడెం, సెప్టెంబరు 14:గిరిజనుల ఆరాధ్య దైవం గుబ్బల మంగమ్మతల్లిని ఎప్పటిలాగానే భక్తులు ఆదివారం దర్శించుకోవచ్చని అలయ కమిటీ తెలిపింది. ఏజెన్సీలో వర్షాలు దృష్ట్యా గత వారం అమ్మవారి దర్శినాలను నిలుపుదల చేశామని ఈ వారం యధావిధిగా భక్తులు ఆలయానికి వచ్చి మొక్కుబడులు తీర్చుకోవచ్చన్నారు. ఉదయం 7 గంటలకల్లా భక్తులు ఆలయానికి వచ్చి అమ్మవారిని దర్శించుకుని సాయంత్రం 3 గంటలకల్లా తిరుగు ప్రయాణం చేయాలన్నారు. వర్షాలు కురుస్తాయని హెచ్చరికలు వస్తున్నందున భక్తులు కమిటీవారికి సహకించాలన్నారు.

మన్యం ధీరుడు ప్రి రిలీజ్



ఎమ్మెల్యే అంజిబాబును సత్కరించిన చిత్ర యూనిట్

భీమవరం టౌన్, సెప్టెంబరు 14: తెలుగు వారు గర్వించదగ్గ వ్యక్తి అల్లూరి సీతారామరాజు, అటువంటి మహనీయుడి చరిత్రతో సినిమా చేయడం గొప్ప విశేషమని ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు (అంజిబాబు) అన్నారు. హీరో, నిర్మాత ఆర్‌వీవీ సత్యనారాయణ, నరేష్ డెక్కల దర్శకత్వం వహించిన మన్యం ధీరుడు చిత్రం ప్రీ రిలీజ్ ఈవెంట్ ను భీమవరం హౌసింగ్ బోర్డు కాలనీ కళ్యాణ మండ పంలో నిర్వహించారు. ఎమ్మెల్యే అంజిబాబు మాట్లాడుతూ మహనీయుల చరిత్ర తెలుసుకుని సినిమా చేయడం అంటే ఎంతో కష్టతరమని, ఆనాటి మహనీయుల చరిత్ర ఘట్టాలను సినిమా రూపంలో చిత్రీకరించడం అ భి నందనీయమని అన్నారు. హీరో, నిర్మాత ఆర్ వివి సత్యనారాయణ మాట్లాడుతూ ఈ చిత్రాన్ని ఈనెల 20న విడుదల చేస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర నాయకులు కోళ్ళ నాగేశ్వరరావు, కంతేటి వెంకటరాజు, పొత్తూరి బాపిరాజు, వేండ్ర వెంకట స్వామి పాల్గొన్నారు.

కిడ్నీ మార్పు లేకుండా వైద్యం.. డాక్టర్‌కు సత్కారం



డాక్టర్ పి.రేఖను సత్కరిస్తున్న దృశ్యం

భీమవరం టౌన్, సెప్టెంబరు 14 : కిడ్నీ వ్యాధితో బాధ పడుతున్న వ్యక్తికి కిడ్నీ మార్పు చేయకుండా వైద్య సేవలు అందించడం చరిత్రలోనే అరుదని, అటువంటి ఘనత భీమవరం ఆడపడుచు సాధించడం గర్వించదగ్గ విషయమని మార్నింగ్ కాఫీ క్లబ్ కన్వీనర్ బొండా రాంబాబు, కో కన్వీనర్ ఓలేటి శ్రీనివాస్, పీఆర్వో భట్టిప్రోలు శ్రీనివాసరావు అన్నారు. ఇటీవలే కిడ్నీ మార్పుచేయకుండా ట్రీట్‌మెంట్‌తో నయం చేసిన భీమవరం పట్టణ ప్రముఖులు కార్మూరి పెరుమాళ్ల గుప్తా కుమార్తె డాక్టర్ పి.రేఖ (ఏఐజి-హైదరాబాద్)ను ఘనంగా సత్కరించారు. సత్కార గ్రహీత డాక్టర్ రేఖ మాట్లాడుతూ హైదరాబాద్‌లో కిడ్నీ వ్యాధితో బాధపడుతున్న వ్యక్తి ఎన్నో ఆసుపత్రులకు తిరిగి మావద్దకు వచ్చారని, కిడ్నీ మార్పు చేయకుండా వైద్యసేవలు అందించి పూర్తిగా నయం చేశామని, ఇటువంటి ట్రీట్‌మెంట్ అరుదుగా వస్తాయని, ఇలా చేయడం చాలా ఆనందంగా ఉందని అన్నారు.

పరిశ్రమలు తెస్తాం... ఉపాధి కల్పిస్తాం

ఏలూరు ఎంపీ పుట్టా

నియామక పత్రం అందజేత





జాబ్ మేళాలో మాట్లాడుతున్న ఏలూరు ఎంపీ మహేశ్‌కుమార్, ఉద్యోగాల ఖాళీల వివరాలు చూసుకుంటున్న అభ్యర్థులు

ఏలూరు టూటౌన్, సెప్టెంబరు 14: ఏలూరుకు పరిశ్రమలు తీసుకువచ్చి ఉద్యోగాలు కల్పిస్తామని ఏలూరు ఎంపీ పుట్టా మహేశ్‌కుమార్ అన్నారు. ఏలూరు గిరిజన భవన్‌లో నిరుద్యోగ యువతకు ఎంపీ జాబ్‌మేళా నిర్వహించారు. జాబ్ మేళాలో 11 లీడింగ్ కంపెనీలు పాల్గొన్నాయి. మేళాను ప్రారంభించిన ఎంపీ మాట్లాడుతూ 'గత వైసీపీ ప్రభుత్వ హయాంలో రాష్ట్రంలో కంపెనీలు పెట్టాలంటే పారిశ్రామికవేత్తలు భయపడేవారు. ఇప్పుడు పారిశ్రామికవేత్తలు రాష్ట్రానికి క్యూకడుతున్నారు. ఎన్నికల్లో నేను ఇచ్చిన వాగ్దానం మేరకు ఏలూరుకు పరిశ్రమలు తీసుకువచ్చి యువతకు ఉపాధి అవకాశాలు కల్పిస్తా. యువత ఎవరూ నిరాశ చెందవద్దు. ఉద్యోగాలకు కొదవ లేదు. యువత స్కిల్స్ నేర్చుకోవాలి. స్కిల్స్ లేకే ఎంతో మంది విద్యార్థులు ఉద్యోగాలు కోల్పోతున్నారు. అందుకే స్కిల్ డెవలప్‌మెంట్ ప్రోగ్రాంలో కూడా యువతకు శిక్షణ ఇస్తున్నాం. ప్రభుత్వ ప్రయోజనాలు పొందాలంటే యువత కష్టపడాలి. ఎవరూ పెద్ద పెద్ద నగరాలకు వెళ్ళకుండానే వారున్నచోట ఉద్యోగాలు కల్పించడానికి కూటమి ప్రభుత్వం నడుం బిగించింది' అని ఎంపీ అన్నారు. భవిష్యత్తులో కూడా మరిన్ని జాబ్ మేళాలు నిర్వహించి నిరుద్యోగ యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పిస్తామని ఎంపీ చెప్పారు. ఏలూరుకు స్కిల్ ఇన్‌క్యూబేషన్ సెంటర్ తీసుకొస్తామన్నారు.

566 మందికి ఉద్యోగాలు

జాబ్ మేళాలో వందలాది మంది నిరుద్యోగ యువత పాల్గొని తమ బయోడేటాలను ఆన్‌లైన్ చేసుకున్నారు. కొంత మందికి కొన్ని కంపెనీలు అక్కడిక్కడే ఉద్యోగాలు ఇచ్చాయి. ఉద్యోగ నియామక పత్రాలను ఎంపీ మహేష్‌కుమార్ యువతకు అందజేశారు. యాపిల్ మొబైల్, జేబీఎల్ స్పీకర్స్, జోయ లుకాస్ ఇండియా, మెడ్‌ప్లస్, అపోలో ఫార్మసీ, వల్లి ఎంటర్ ప్రైజెస్, తదితర కంపెనీలు పాల్గొన్నాయి. మేళాకు 1226 మంది హాజరవ్వగా 566 మందిని ఉద్యోగాలకు ఎంపిక చేసి నియామకపత్రాలు అందించారు. కాత్రు బాలు, మాగంటి హేమసుందర్, ఎం.చింతయ్య, నందిగం బాబి, దాసరి ఆంజనేయులు పాల్గొన్నారు.

లోక్ అదాలత్‌లో 2,466 కేసులు పరిష్కారం

ఏలూరు క్రైం, సెప్టెంబరు 14 : ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలో శనివారం రాత్రి 8 గంటల వరకు జరిగిన లోక్ అదాలత్‌లో 2466 కేసులు రాజీ చేయడం జరిగిందని న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి కె.రత్న ప్రసాద్ చెప్పారు. ఏలూరులోని ప్రముఖ వాణిజ్య సంస్థల మధ్య ఉన్న చెక్ బౌన్స్ కేసులో ఐదు కోట్ల 50 లక్షల రూపాయలకు రాజీచేయడం జరిగిందని అన్నారు. గత 17 సంవత్సరాల నుంచి పెండింగ్‌లో ఉన్న భూ సేకరణకు సంబంధించిన రెండు కేసులను పరిష్కరించడంతో పాటు ఒక వాహన ప్రమాద భీమా కేసులో 50 లక్షల రూపాయలను పరిహారంగా బాధితులకు ఇవ్వడం జరిగిందన్నారు. జిల్లాలో పరిష్కరించిన కేసుల్లో 2149 క్రిమినల్ కేసులు, 193 సివిల్ కేసులు, 124 వాహన ప్రమాద భీమా కేసులు ఇవి కాక 130 ప్రీలిటికేషన్ కేసులు పరిష్కరించడం జరిగిందన్నారు.

ఈఎన్‌టీ శస్త్ర చికిత్సలో విప్లవాత్మక మార్పులు



అవార్డు గ్రహీతలకు సత్కారం

భీమవరం క్రైం, సెప్టెంబరు 14 : ప్రపంచ వైద్యరంగంలో వస్తున్న మార్పులకు అనుగుణంగా చెవి, ముక్కు, గొంతు శస్త్ర చికిత్సల్లో విప్లవాత్మకమైన మార్పులు వచ్చాయని శాసనమండలి ఛైర్మన్ కొయ్యే మోషేన్‌రాజు అన్నారు. స్థానిక రాధాకృష్ణ కాన్ఫరెన్స్ హాల్‌లో మూడు రోజులపాటు జరిగే రాష్ట్రస్థాయి చెవి, ముక్కు, గొంతు వైద్యుల 42వ వార్షిక సమావేశంలో మోషేన్‌రాజు ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు మాట్లాడుతూ ప్రజలకు వ్యాధుల పట్ల అవ గాహన అవసరమని, లోపాలను ముందే గమనిస్తే పరిష్కార మార్గాలు ఎన్నో ఉంటా యన్నారు. రాష్ట్ర చెవి, ముక్కు, గొంతు వైద్యుల యూనియన్ తరపున పద్మశ్రీ జేఎమ్ హ్యాన్స్, పద్మశ్రీ డా.మిలింద్ వికీర్ తనే, డా.కేకే రామలింగంలను సత్కరించారు. భీమవరం పట్టణానికి చెందిన చెవి, ముక్కు, గొంతు వైద్యులు డా.నడింపల్లి రాజన్‌రాజుకు రాష్ట్ర యూనియన్ తరుపున జీవిత సాఫల్య పురస్కార అవా ర్డుతో సత్కరించారు. ఏలూరు ఆశ్రమ కళాశాల డైరెక్టర్ రతీదేవి, రాష్ట్ర అధ్యక్షులు నడింపల్లి శంకర్‌కుమార్ వర్మ, డాక్టర్ గొట్టుముక్కల బాలకృష్ణంరాజు, డాక్టర్ శేఖర్‌రెడ్డి, డాక్టర్ హరినాథ్, డాక్టర్ పీఎస్ఎస్ మూర్తి పాల్గొన్నారు.

కేంద్ర ప్రభుత్వం దృష్టికి రైతుల సమస్యలు

భీమవరం రూరల్, సెప్టెంబరు 14 : ఇటీవల కురిసిన వర్షాలకు నష్టపోయిన రైతులకు ఎలా సహకరించాలో ఆంధ్రప్రదేశ్ రైతు కార్యాచరణ సమితి ప్రతిపాదనలు ఇచ్చిందని వాటిని పరిగణనలోకి తీసుకుని అవి కేంద్ర ప్రభుత్వం వరకు వెళ్ళామని రాష్ట్ర రైతు కార్యాచరణ సమితి అధ్యక్షులు పాతపాటి మురళి రామరాజు తెలిపారు. శనివారం భీమవరంలో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా మురళి రామరాజు మాట్లాడుతూ కొన్ని రోజులు క్రితం పంట నష్టపోయిన రైతుల కోసం కలెక్టర్ నాగరాణి బ్యాంకర్లు, రైతు కార్యాచరణ సమితి సమావేశం నిర్వహించారన్నారు.



రావిచెట్టు సెంటర్‌లో మృతదేహంతో రాస్తారోకో చేస్తున్న గ్రామస్థులు

శ్మశానానికి దారి చూపాలంటూ

మృతదేహంతో రాస్తారోకో

పాలకోడేరు, సెప్టెంబరు 14: పాలకోడేరులోని శ్మశాన వాటిక రహదారి వివాదం మళ్ళీ తెరపైకి వచ్చింది. పాలకోడేరు శివారులోని పంతొట్టి వద్ద ఉన్న శ్మశానవాటిక దారి విషయమై కొంత కాలంగా ఆ ప్రాంతంలో నివసిస్తున్న వారికి, గ్రామంలోని కొంతమందికి మధ్య తగువు నడుస్తున్నది. ఈ క్రమంలోనే శనివారం గ్రామంలో ఒక మహిళ మృతి చెందటంతో ఆ మృతదేహాన్ని పంతొట్టి నివాసాల మధ్య నుంచి తీసుకెళ్ళేందుకు ప్రయత్నం చేశారు. అయితే ఆ ప్రాంత వాసులు ఇటువైపుగా రహదారి లేదని గతంలోనే అధికారులు తెలియపరచటం కూడా జరిగిందని అడ్డు చెప్పడంతో గ్రామంలోని రావిచెట్టు సెంటర్‌లో మృతదేహం పెట్టి గంటపాటు గ్రామస్థులు ధర్నా నిర్వహించారు. దీంతో అటు భీమవరం వైపు ఇటూ తణుకు వైపు వెళ్ళే వాహనాలు, వేండ్ర వైపు వెళ్ళే వాహనదారులకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. భీమవరం రూరల్ ఇన్‌చార్జ్ సీఐ కాళీచరణ్, డిప్యూటీ తహసీల్దార్ సూర్యనారాయణరాజు, ఎంపీడీవో గంగాధరరావు, పాలకోడేరు ఎస్సై హరిబాబు, కాళ్ళ ఎస్సై నాళం శ్రీనివాసరావు సంఘటన స్థలానికి చేరుకుని బాధితులతో మాట్లాడారు. ఇటు బాధితులతో, పంతొట్టి నివాసవాసులతో మాట్లాడి సమస్యను ప్రస్తుతానికి పరిష్కరించారు. ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు. రహదారిపై మృతదేహం పెట్టి రాస్తారోకో చేయడం సరికాదని పంతొట్టి వాసులతో మాట్లాడి ప్రస్తుతానికి మృతదేహాన్ని అధికారులు ఖననం చేయించారు. సోమవారం గ్రామనాయకులు, అధికారులతో కూర్చుని మాట్లాడుకుని శ్మశాన వాటిక సమస్య పరిష్కారం అయ్యేవిధంగా కృషి చేస్తామని అధికారులు తెలిపారు.

భర్తను రప్పించండి..



వినతిపత్రం అందిస్తున్న దృశ్యం

తాడేపల్లిగూడెం రూరల్, సెప్టెంబరు 14: జీవనోపాధి కోసం బెహరైన్ దేశం వెళ్లిన తన భర్త రాజేష్ అక్కడ జైల్లో మగ్గుతున్నాడని మన దేశానికి అయన్ను రప్పించాలని తూర్పు గోదావరి జిల్లా పెద్దపట్నం లంకకు చెందిన ప్రసన్న శనివారం కైండ్‌నెస్ సొసైటీ అధ్యక్షుడు గట్టిం మాణిక్యాలరావుకు శనివారం వినతిపత్రం అందించారు. జీవనోపాధి కోసం వెళ్లిన రాజేష్ అక్కడే ఇరుక్కుపోవడంతో ఇక్కడ పిల్లలతో ఇబ్బంది పడుతున్నానని ఆవేదన వ్యక్తం చేశారు.

క్రైం కార్నర్

ఆన్‌లైన్‌లో తస్కరించిన సొమ్ముల రికవరీ

ఏలూరు క్రైం, సెప్టెంబర్ 14 : సైబర్ నేరగాళ్ళు ఆన్‌లైన్ ద్వారా తస్కరించిన సొమ్ములను తిరిగి రికవరీ చేశారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో సైబర్ నేరగాళ్లు ఎదుటివారి ఆశను ఆసరా చేసుకుని తక్కువ సమయంలో ఎక్కువ డబ్బులు సంపాదించాలని మక్కువ కలిగిన యువతను ఆకర్షించే విధంగా వివిధ సోషల్ మీడియా మాధ్యమాల్లో ప్రకటనల రూపంలో పెడుతూ ఆకర్షిస్తున్నారు. వాటిని నమ్మి ఆన్‌లైన్ ద్వారా సొమ్ములు చెల్లించిన వారు మోసపోయామని లబోదిబో మంటూ సైబర్ సెల్ క్రైమ్ 1930కు ఫిర్యాదు చేస్తున్నారు. ఈ విధంగా జిల్లాలో ఫిర్యాదులు చేసిన వాటిలో రెండు ఫిర్యాదులకు సంబంధించిన రెండు లక్షల రూపాయలను సైబర్ సెల్ పోలీసులు రికవరీ చేశారు. జంగారెడ్డిగూడానికి చెందిన ఒక మహిళ సోషల్ మీడియా మాధ్యమాల ద్వారా ఆన్‌లైన్ ఇన్వెస్టెమెంట్ అనే ప్రకటన చూసి తనకు ఎక్కువ వడ్డీ వస్తుందని ఆశపడి 90 వేల రూపాయలు చెల్లించింది. ఆతరువాత మోసపోయానని 1930కు ఫిర్యాదు చేసింది. దీంతో ఏలూరు జిల్లా సైబర్ క్రైమ్ పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. అదే విధంగా ఏలూరు త్రి టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఒక వ్యక్తి కూడా లక్ష పది వేల రూపాయలు పోగొట్టుకున్నాడు. అతను కూడా సైబర్ క్రైమ్ 1930కు ఫిర్యాదు చేశారు. ఈరెండు ఫిర్యాదులపై జిల్లా ఎస్పీ కెపిఎస్ కిషోర్ ఆదేశాల మేరకు ఏలూరు జిల్లా సైబర్ సెల్ పోలీస్ స్టేషన్ ఎస్ఐ మధు వెంకట రాజా వారి సిబ్బంది దర్యాప్తు చేసి మొత్తం రెండు లక్షల రూపాయలను తిరిగి రికవరీ చేశారు.

పట్టపగలే చోరీ



వేలిముద్రలు పరిశీలిస్తున్న క్లూస్ టీమ్ అధికారులు

మొగల్తూరు,సెప్టెంబరు 14: రామన్నపాలెం పంచాయతీ పరిధిలో అంగన్ వాడీ వర్కర్ కడలి వెంకట లక్ష్మీ ఇంటిలో ఎవ్వరూ లేని సమయంలో శనివారం పట్టపగలు దొంగలు దోపి డి చేసినట్లు తెలిసింది. ఇంటిలో 8 కాసుల బం గారు ఆభరణాలు, 30తులాలు బరువు గల వెండి వస్తువులు, రూ.40వేల నగదు దొంగలు అపహరించుకుపోయారు. ఇదే గృహంలో సీసీ కెమెరాలు ఉండట ంతో కంప్యూటర్‌కు సంబంధించి హార్డ్ డిస్కను దొంగలు దొంగిలించినట్లు తెలిసింది. ఈఘటనపై క్లూస్ టీమ్ అధికారులు ఆగృహాన్ని సందర్శించి వేలిముద్రలు సేకరించారు.

అత్యాచారం కేసులో నిందితుడి అరెస్టు

భీమవరం క్రైం, సెప్టెంబరు 14 : అత్యాచారం కేసులో నిందితుడిని శనివారం అరెస్టు చేసినట్లు డీఎస్పీ ఆర్‌జీ జయసూర్య తెలిపారు. ఆయన తెలిపిన వివరాలు ప్రకారం బలుసుమూడి ప్రాంతానికి చెందిన ఒక మహిళను ఈనెల 11వ తేదీ రాత్రి 18వ వార్డు పాలూరివారి వీధికి చెందిన చెన్నంశెట్టి మధుకుమార్ ఫోన్ చేసి ఒక కళాశాల గ్రౌండ్‌కు రప్పించుకుని ఆమెను కొట్టి అత్యాచారం చేయడంతో పాటు కులం పేరుతో దూషించినట్లుగా ఆ మహిళ టూటౌన్ పోలీసలకు ఫిర్యాదు చేశారు. దీనిపై కేసు నమోదు చేసిన పోలీసులు మధుకుమార్‌ను అరెస్టు చేసి కోర్టుకు తరలించడంతో అక్కడ న్యాయమూర్తి 15 రోజులు పాటు రిమాండ్ విధించినట్లు డీఎస్పీ తెలిపారు.

గర్భిణి అనుమానాస్పద మృతి



రావూరి దేవి (ఫైల్‌ఫొటో)

పాలకొల్లు రూరల్, సెప్టెంబరు 14 : భగ్గేశ్వరం గ్రామానికి చెందిన రావూరి దేవి (25) అనుమానాస్పద స్థితిలో మరణించినట్లు పట్టణ ఎస్ఐ బి.శ్రీనివాస్ తెలిపారు. మృతురాలి తండ్రి ఇళ్ళ వెంకటేశ్వరరావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు శనివారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు. భగ్గేశ్వరం గ్రామానికి చెందిన రావూరి జనార్ధనరావు 9 నెలల క్రితం ఇళ్ళ దేవిని వివాహం చేసుకున్నాడని, ప్రస్తుతం దేవి ఆరు నెలల గర్భిణీ. ఈనేపథ్యంలో శుక్రవారం మధ్యాహ్నం భార్య భర్తలు తగవు పడ్డారు. అనంతరం భర్త బయటకు వెళ్ళిపోయాడని ఎస్ఐ తెలిపారు. అనంతరం దేవి తలుపులు వేసుకుని గడియ పెట్టుకుని ఉరి వేసుకుందని తెలిపారు. వీరిది కులాంతర వివాహం కావడంతో పాటు జనార్ధన్‌కు గతంలో వివాహం జరిగి విడాకులు తీసుకున్నట్టు ఎస్ఐ తెలిపారు. ఈనేపథ్యంలో మృతురాలి తండ్రి వెంకటేశ్వర్లు ఇచ్చిన ఫిర్యాదు మేరకు మృతురాలి భర్త జనార్ధనరావు, మామ పరదేశి, అత్త చంద్రాలపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.

అదనపు కట్నం వేధింపులపై కేసు

జంగారెడ్డిగూడెం,సెప్టెంబరు 14: అదనపు కట్నం కోసం భర్తతో పాటు మరికొందరు వేధిస్తున్నారని ఇచ్చిన ఫిర్యాదు మేరకు ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై ఎస్.కె.జబీర్ తెలిపారు. మండలంలోని ఏ.పోలవరం గ్రామానికి చెందిన కోయ సాయిలక్ష్మికి గౌతమ్ చక్రవర్తితో 2018లో వివాహం అయ్యిందన్నారు. వివాహ సమయంలో సాయిలక్ష్మి కుటుంబ సభ్యులు కట్నం ఇచ్చారన్నారు. అయినా కూడా మరో రూ.ఐదు లక్షలు అదనపు కట్నం తీసుకురావాలంటూ భర్త గౌతమ్ చక్రవర్తితో పాటు మరో ఇద్దరు మహిళలు వేధిస్తున్నారని ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

డ్రైవర్‌పై కేసు నమోదు

జంగారెడ్డిగూడెం, సెప్టెంబరు 14: వ్యాన్‌ను నిర్లక్ష్యంగా నడిపి పలువురికి గాయాలకు కారణమైన వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై ఎస్‌.కె.జబీర్ తెలిపారు. కోనసీమ జిల్లా రామచంద్రపురం మండలం, కందులపాలెం గ్రామానికి చెందిన పిల్లి దుర్గా భవాని తన భర్త, పిల్లలతో హైదరాబాదులోని ఓ అపార్ట్‌మెంట్‌లో వాచ్‌మెన్‌గా పనిచేస్తూ జీవిస్తున్నారు. దుర్గా భవాని తన చిన్న కుమారుడితో కలిసి ఈ నెల 11న తన స్వగ్రామం కందులపాలెం వచ్చారు. తిరిగి 12 వ తేదీన హైదరాబాదుకు తన మరిదికి చెందిన కొబ్బరికాయల వ్యానులో బయలుదేరారు. క్యాబిన్ లోపల దుర్గా భవాని, ఆమె చిన్న కుమారుడు కూర్చోగా వ్యాను వెనుక భాగంలో దుర్గా భవాని తండ్రి, బావ కూర్చున్నారు. తన మరిది వ్యాను డ్రైవింగ్ చేస్తున్నాడు.అర్ధరాత్రి ఒంటిగంటకు వ్యాను జంగారెడ్డిగూడెం మండలం వేగవరం చేరుకునే సరికి వ్యాను ఆగివున్న వాహనాన్ని వెనుక భాగంలో ఢీకొట్టాడు. ఈ ఘటనలో వ్యాన్‌లో ఉన్న వారికి గాయాలయ్యాయి. డ్రైవరుపై కేసు నమోదు చేశామని తెలిపారు.

మహిళకు మత్తు మందు ఇచ్చి చోరీ

తాడేపల్లిగూడెం రూరల్, సెప్టెంబరు 14: సినీ ఫక్కీలో ఇంట్లోకి మంచినీళ్లు కావాలని ప్రవేశించిన యువకుడు ఆ ఇంటిలో మహిళకు మత్తు చల్లి ఇంట్లోని నగదు, బంగారం అపహరించిన ఘటన మాధవరంలో శనివారం రాత్రి చోటుచేసుకున్నది. పోలిసులు, స్థానికులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మాధవరంకు చెందిన గోపిశెట్టి శ్రీలక్ష్మి ఇంటికి సాయంత్రం సమయంలో ఓ వ్యక్తి మంచినీళ్లు కావాలంటూ వచ్చాడు. అతనికి మంచినీళ్లు తెచ్చే క్రమంలో ఆ వ్యక్తి మహిళకు మత్తుస్ప్రే చేసి ఆ మహిళను పక్కన కుర్చోబెట్టి ఇంట్లోని బంగారం, నగదు అపహరించుకుపోయాడు. కొంత సమయం తరువాత స్పృహ వచ్చి చూసేసరికి ఇంటిలోని పదికాసుల బంగారం, రూ.1లక్షల నగదు చోరీ చేసినట్టు గుర్తించారు. ఈ మేరకు శ్రీలక్ష్మి ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసి దర్యాప్తుచేస్తున్నట్టు ఎస్సై ప్రసాద్ తెలిపారు. ఏలూరు నుంచి క్లూస్‌టీం సంఘటనా స్థలం వద్ద వేలిముద్రలు సేకరించారు.



చర్చా గోష్ఠిలో మాట్లాడుతున్న డీవీవీఎస్ వర్మ

సంపద పునఃపంపిణీతోనే సంక్షేమ రాజ్యం

తణుకు, సెప్టెంబరు 14 : సంపద పునఃపంపిణీతోనే సంక్షేమ రాజ్యం సాధ్యపడుతుందని దారిదీపం సంపాదకులు డీవీవీఎస్ వర్మ అన్నారు. శనివారం తణుకు స్టడీ సర్కిల్ ఆధ్వర్యంలో సురాజ్య భవనంలో అసమాన భారతంపై చర్చాగోష్ఠి నిర్వహించారు. చర్చాగోష్ఠి సమన్వయకర్త వర్మ మాట్లాడుతూ ఆక్స్‌ఫామ్ నివేదికల ప్రకారం దేశంలో పది శాతంగా ఉన్న బిలియనీర్లు, కార్పొరేట్లు, కుబేరులు దగ్గర మొత్తం దేశ సంపదలో 77శాతం పోగుపడ్డ తీరును ప్రస్తావించారు. ఈ పదేళ్లలో ప్రధాని మోదీ పాలనలో 35 శాతంగా ఉన్న కార్పొరేట్ పన్నును అంచెలంచెలుగా 22 శాతానికి తగ్గించారన్నారు. వారికే దాదాపు రూ.20 లక్షల కోట్లు అప్పులను రద్దు చేశారని చెప్పారు. గతంలో పది శాతంగా ఉన్న వారసత్వ పన్నును పూర్తిగా తొలగించారన్నారు. మరోపక్క జీఎస్టీని నిత్యావసరాలన్నిటికి విస్తరించి ధరల భారాన్ని ప్రజల మీద మోపారని ప్రత్యక్ష పన్నుల కంటే పరోక్ష పన్నులను పేదలు, సామాన్యులు నుంచి దండుకోవడాన్ని విమర్శించారు. పది శాతం కుబేరులు దగ్గ పోగుబడ్డ సంపదకు కునారిల్లుతున్న 75శాతం ప్రజల జీవన స్థితికి మధ్య ఉన్న అగాధమే ప్రధాన సమస్య అయ్యిందని, పోగుపడ్డ సంపద పునఃపంపిణీ నినాదంతో ప్రచారం జరగాలని అభిప్రాయపడ్డారు. సీపీఎం జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి మృతికి పలువురు నివాళర్పించారు. ఒంగోలు సైంటిఫిక్ సోషలిస్టు స్టడీ సర్కిల్ కన్వీనర్ ఎం.వెంకయ్య వివిధ పార్టీల నాయకులు కోనాల భీమారావు, బొద్దాని నాగరాజు, అప్పలస్వామి, పీవీప్రతాప్, గార రంగారావు, కడలి రామారావు, పేరూరి మురళీకుమార్, అంబేద్కర్, సంకు మనోరమ, వెంకటేశ్వరరావు, కౌరు వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

లింగపాలెం ఎంపీడీవో సస్పెన్షన్

గతంలో ద్వారకా తిరుమలలో పనిచేసిన ఆశీర్వాదం

ద్వారకాతిరుమల, సెప్టెంబరు 14 : ద్వారకా తిరుమల పంచాయతీలో 2 కోట్ల రూపాయలు పైబడి జరిగిన అవినీతిపై ఇప్పటికే కార్యదర్శి లంకలపల్లి వెంకటేశ్వరరావును సస్పెండ్ చేసిన అధికారులు తాజాగా పూర్వపు ఎంపీడీవో ఎస్.ఆశీర్వాదంను సస్పెండ్ చేశారు. ఈ మేరకు పంచాయతీ రాజ్ కమిషనర్ కృష్ణతేజ సస్పెండ్ చేసినట్లు జడ్పీ సీఈవో కెఎస్ఎస్ సుబ్బారావు తెలిపారు. పంచాయతీలో జరిగిన అవినీతిలో గతంలో ఇక్కడ ఎంపీడీవో, స్పెషల్ ఆఫీసర్‌గా పనిచేసి, ప్రసుతం లింగపాలెం మండలంలో ఎంపీడీవోగా పనిచేస్తున్న ఎస్ ఆశీర్వాదం ఇక్కడ చేసిన రూ.18,73,538 నిధుల దుర్వినియోగం అభియోగంపై ఈ వేటు పడినట్లు తెలుస్తోంది. అదేవిదంగా సర్పంచ్ కుంటం స్వర్ణలత రూ.53,57,376 నిధుల దుర్వినియోగంపై రికవరీ చేయాలని, అలాగే చెక్‌పవర్ ఎందుకు రద్దు చేయకూడదని ఇప్పటికే షోకాజ్ నోటీసు ఇచ్చినట్లు అధికారులు చెప్పారు.

పశు వైద్య శిబిరాలు ఏర్పాటు చేయండి : మంత్రి

ఆగిరిపల్లి, సెప్టెంబరు 14: ప్రతి మండలంలోనూ పశు వైద్య శిబిరాలను ఏర్పాటు చేయాలని, సమాచార పౌర సంబంధాలు, గృహ నిర్మాణ శాఖ మంత్రి కొలుసు పార్థసారథి అధికారులను ఆదేశించారు. ఆగిరిపల్లి మండలం సీతారాం పురంలో శనివారం గొర్రెలు, మేకల పెంపకందారులకు మంత్రి దాణాను అందజేసి మాట్లాడుతూ గొర్రెలు, మేకలకు నట్టల నివారణ మందు, పశువులకు వ్యాక్సినేషన్ అందించాలన్నారు.

వైద్య సేవల్లో అలసత్వం వద్దు: కలెక్టర్


ఏరియా ఆసుపత్రిలో వైద్యులతో మాట్లాడుతున్న కలెక్టర్

తాడేపల్లిగూడెం రూరల్, సెప్టెంబరు 14: రోగులకు మెరుగైన వైద్య సదుపాయాలు అందించడంలో అలసత్వం వద్దని కలెక్టర్ నాగరాణి వైద్యులకు సూచించారు. తాడేపల్లిగూడెం ఏరియా ఆసుపత్రిని శనివారం ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్‌తో కలిసి పరిశీలించారు. వార్డుల్లో పర్యటించి వైద్య సదుపాయాలపై ఆరా తీయగా రాత్రి సమయంలో డ్యూటీ డాక్టర్‌లు అందుబాటులో ఉండటంలేదని ఏఎన్‌ఎంలతోనే వైద్యం అందిస్తున్నారని రోగులు చెప్పడంతో ఆగ్రహం వ్యక్తం చేశారు. సిబ్బంది హాజరు రికార్డులు క్షుణ్ణంగా పరిశీలించి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని సూచించారు. తమకు జీతాలు ఇవ్వడంలేదని పారిశుధ్య సెక్యూరిటీ సిబ్బంది కలెక్టర్, ఎమ్మెల్యేకు తెలపగా జీతాలు ఇప్పిస్తామని హామీ ఇచ్చారు. సూపరింటెండెంట్ సూర్యనారాయణ, వైద్యులు పాల్గొన్నారు.

బాగా చదివి మంచి భవిష్యత్తు పొందాలి : కలెక్టర్

ఉండి, సెప్టెంబరు 14 : యండగండి ప్రభుత్వ జూనియర్ కాలేజీని జిల్లా కలెక్టర్ నాగరాణి శనివారం ఆకస్మికంగా సందర్శించారు. క్లాస్ రూమ్‌లోకి వెళ్లి విద్యార్థులతో ముచ్చటించారు. బాగా చదువుకుని మంచి భవిష్యత్తుని సాధించాలని సూచించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ రామప్రియను కాలేజీలోని గ్రూపులపై ప్రశ్నించారు. మరింత ఎక్కువగా కాలేజీలో జాయిన్ అయ్యేలా చూడాలని, క్లాస్ రూములు, పరిసరాలు పరిశుభ్రంగా ఉంచాలని సూచించారు. అధ్యాపకులు, సిబ్బంది, తదితరులు ఉన్నారు.

'కౌలు రైతులకే నష్టపరిహారం ఇవ్వాలి'

భీమవరం రూరల్, సెప్టెంబరు 14 :జిల్లాలో కురిసిన అధిక వర్షాలకు పంట దెబ్బతిన్న మండలాల్లో కౌలు రైతులకు పంట నష్టపరిహారం అందేలా చర్యలు తీసుకోవాలని ఏపీ కౌలు రైతులు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి మామిడిశెట్టి రామాంజనేయులు ఓ ప్రకటనలో శనివారం డిమాండ్ చేశారు. జిల్లాలో 16 మండలాల్లో 8 వేల ఎకరాల్లో పంట నష్టం జరిగి 6500 మంది వరకు పంట కోల్పోయారని, ఎకరాకు దాదాపు రూ.25 వేల వరకు నష్టపోయారని, జిల్లాలో 90శాతం వ్యవసాయం కౌలు రైతులే సాగు చేస్తున్నారన్నారు. జిల్లా కలెక్టర్, ఉన్నతాధికారులు తగు చర్యలు తీసుకుని, గ్రామస్థాయిలో పరిశీలించి వాస్తవ కౌలు రైతులకు పంట నష్టం, పంట భీమా అందించి కౌలు రైతులందరికీ వడ్డీలేని పంట రుణాలు అందివ్వాలని కోరారు.

డిగ్రీ కాలేజీలో గుప్పెడు బియ్యం


గుప్పెడు బియ్యాన్ని విరాళంగా వేస్తున్న విద్యార్థినులు

గణపవరం, సెప్టెంబరు 14: గణపవరంలోని చింతలపాటి మూర్తిరాజు ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో హ్యాండ్‌ఫుల్ ఆఫ్ రైస్ (గుప్పెడు బియ్యం) కార్యక్రమం నిర్వహించారు. ప్రిన్సిపాల్ నిర్మలకుమారి మాట్లాడుతూ విద్యార్థులంతా కళాశాలకు వచ్చేటప్పుడు ఒక గుప్పెడు బియ్యం తీసుకురావాలని కోరారు. విద్యార్థులు, ఉపాధ్యాయులు అలా తీసుకొచ్చిన గుప్పెడు బియ్యాన్ని నిల్వ చేసి పేదలకు ఉచితంగా పంచే కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ మధురాజు, చైతన్య, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

మావుళ్ళమ్మకు బంగారం అందజేత

భీమవరంటౌన్.సెప్టెంబరు 14:భీమవరం మావుళ్ళమ్మకు దాతలు పది గ్రాముల బంగారాన్ని దాతలు అందజేశారు. నరసారావుపేటకు చెందిన కె.జగన్‌మోహన్‌రెడ్డి ఎనిమిది గ్రాముల బంగారం, డి.విశ్వేశ్వరావు రెండు గ్రాముల బంగారం అందజేశారు. తొలుత అమ్మవారిని దాతలు దర్శించుకున్నారు. ప్రధానార్చకుడు మద్దిరాల మల్లికార్జునశర్మ పూజలు చేసి ఆశీర్వచనాలు అందించారు. దేవస్థానం తరపున ప్రసాదాన్ని ఈవో నగేష్ అందించారు.

నన్నయ క్యాంపస్ ప్రొఫెసర్‌కు అవార్డు



తాడేపల్లిగూడెం రూరల్, సెప్టెంబరు 14: తాడేపల్లిగూడెంలోని ఆదికవి నన్నయ వర్సిటీ క్యాంపస్ అధ్యాపకుడు డాక్టర్ బీవీఏ స్వామి ఏపీఎంపీఏ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు అందుకున్నారు. ఏపీ ఎంఈడీ ప్రోస్పెక్ట్ అసోసియేషన్ ద్వారా ప్రభుత్వ ఎగ్జామినేషన్స్ డైరెక్టర్ దేవానందరెడ్డి చేతుల మీదుగా ఈ అవార్డు అందుకున్నారు. ఈ సందర్భంగా అవార్డు గ్రహీతను క్యాంపస్ అధికారులు అభినందించారు.

25 టన్నుల ఉచిత పశువుల దాణా పంపిణీ

ఆకివీడురూరల్/ఆకివీడు, సెప్టెంబరు 14 :కొల్లేరు వరదకు గురైన ఆకివీడు మండలంలోని 5 గ్రామాల్లో 25టన్నులు ఉచిత పశుదాణాను శనివారం పంపిణీ చేశారు. ఆయా ప్రాంతాల్లో వెయ్యి పశువులకు ఈ దాణా అందించినట్టు పశుసంవర్ధకశాఖ డీడీ జవహర్ హుస్సేన్ తెలిపారు. సమతానగర్‌లో టీడీపీ పట్టణ అధ్యక్షుడు బొల్లా వెంకట్రావు రైతులకు ఉచిత దాణా బస్తాలు అందజేశారు. వెటర్నరీ ఏడీ జనార్థనరావు, టీడీపీ నేతలు, వెటర్నరీ సిబ్బంది ఉన్నారు.

ఐఎఫ్‌టీయూ తరగతులు జయప్రదం చేయాలి

తాడేపల్లిగూడెం రూరల్, సెప్టెంబరు 14: ఐఎఫ్‌టీయూ ఆధ్వర్యంలో ఈ నెల 21, 22 తేదీల్లో తాడేపల్లిగూడెం శేషమహల్ సెంటర్‌లో నిర్వహించే జిల్లాస్థాయి రాజకీయ తరగతులు జయప్రదం చేయాలని జిల్లా సహాయ కార్యదర్శి మామిడి దానవరప్రసాద్ పిలుపునిచ్చారు. శనివారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కార్మిక వర్గాల్లో రాజకీయ చైతన్యం కోసం ఎంపిక చేసిన ప్రతినిధులకు ఈ తరగతులు ఉంటాయని వివరించారు. ఎం. విజయ్, ఎం. శ్రీను, గొర్ల శ్రీను, బారా చిన్న తదితరులు పాల్గొన్నారు.

17న నులి పురుగుల నిర్మూలన కార్యక్రమం

ఆకివీడు/పాలకొల్లు రూరల్, సెప్టెంబరు 14 : విద్యార్థుల ఆరోగ్యాలు కాపాడడం మనందరి ధర్మమని ఆకివీడు నగర పంచాయతీ కమిషనర్ జి.కృష్ణ మోహన్, యూపీహెచ్‌సీ సూపరింటెండెంట్ వెంకటపతిరాజు, ఎంఈవో శీతా రామయ్య అన్నారు. ఈనెల 17న నులిపురుగుల నిర్మూలన దినోత్సవం సందర్భంగా ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలో ఉన్న విద్యార్థులందరికీ నులిపురుగుల మాత్రలు వేసి జయప్రదం చేయాలన్నారు. పాలకొల్లు ఎంపీడీవో కార్యాలయం వద్ద నులిపురుగుల నివారణపై ప్రచురించిన పోస్టర్‌ను ఎంపీడీవో సంగాని వెంకటేశ్వరరావు ఆవిష్కరించారు. లంకలకోడేరు పీహెచ్‌సీ డాక్టర్ ఎ.ప్రతాప్‌కుమార్ మాట్లాడుతూ ఒకటి నుంచి 19 ఏళ్ళ వయస్సు ఉన్న వారందరికీ ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేస్తామన్నారు.

సంక్షిప్త సమాచారం..

- **నరసాపురం టౌన్, సెప్టెంబరు 14:** పురపాలక సంఘంలో పారిశుధ్య కార్మికులకు అందించే పనిముట్ల నాణ్యతను శనివారం కమిషనర్ అంజయ్య పరిశీలించారు. అనంతరం ఆరోగ్య కేంద్రాన్ని పరిశీలించారు.
- **నరసాపురం రూరల్ :** రోబోటెక్, ఆర్టిఫీషియల్ ఇంజనీరింగ్ విద్యకు భవిష్యత్‌లో ఉజ్వల భవిష్యత్ ఉందని స్వర్ణాంధ్ర ఇంజనీరింగ్ కళాశాలలో శనివారం జరిగిన సర్టిఫికెట్ల పంపిణీ కార్యక్రమంలో ఎస్‌ఆర్‌ఐ కొవ్వలి నాయుడు అన్నారు.
- **నరసాపురం టౌన్ :** యువత సెల్‌ఫోన్లకు అలవాటు పడి చదువులకు దూరం అవుతున్నారని, దీన్ని నియంత్రించుకున్నప్పుడే చదువుపై శ్రద్ధ పెరుగుతుందని పట్టణంలోని సూర్య కళాశాలలో జరిగిన టీచర్స్ డే వేడుకల్లో ఆర్డీవో అంబరీష్ అన్నారు.
- **పాలకోడేరు :** పార్టీలకు అతీతంగా గ్రామాభివృద్ధికి అన్ని విధాలా సహకరిస్తానని గొల్లలకోడేరు 2వ వార్డులో డ్రైనేజీ, దానిపై కల్వర్టు నిర్మాణ భూమి పూజ కార్యక్రమంలో శనివారం టీడీపీ నాయకులతో కలిసి సర్పంచ్ కుక్కల లక్ష్మి అన్నారు.
- **భీమవరంటౌన్ :** భీమవరం హౌసింగ్ బోర్డు కాలనీ శ్రీవారి ఆలయంలో పెచ్చెట్టి శ్రీవిష్ణుమూర్తి దంపతులు, బోడపాటి పెద్దిరాజు దంపతులు శాశ్వత నిత్య పూజల నిమిత్తం రూ.25వేల చొప్పున అందజేశారు.
- **పెనుగొండ :** దొంగరావిపాలెం మాజీ సర్పంచ్ కడలి సత్యనారాయణ మాతృమూర్తి నాగమణి ఇటీవల మృతి చెందడంతో కుటుంబ సభ్యులను ఎమ్మెల్యే పితాని సత్యనారాయణ శనివారం పరామర్శించారు.
- **పెనుమంట్ర :** ఆలమూరుకు చెందిన టీడీపీ వర్కింగ్ ప్రెసిడెంట్ తేతలి వెంకటరామారెడ్డి సతీమణి నాగమణి ఇటీవల మరణించడంతో కుటుంబ సభ్యులను ఎమ్మెల్యే పితాని సత్యనారాయణ పరామర్శించారు.


ఎమ్మెల్యే అంజిబాబుకు రూ.14.లక్షలు అందించిన భీమవరం ప్యాడీ అండ్ రైస్ మర్చంట్స్ అసోసియేషన్ నాయకులు


ఎమ్మెల్యే అంజిబాబుకు రూ.4 లక్షల చెక్కు అందించిన బులియన్ మర్చంట్స్, ధర్మకాట, పాన్ బ్రోకర్స్ అసోసియేషన్


తణుకులో ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణకు చెక్కులు అందజేస్తున్న దాతలు


తాడేపల్లిగూడెంలో వలవల బాబ్జికి రూ.50 వేలు విరాళం అందజేస్తున్న అలంపురం టీడీపీ నాయకులు

వరద బాధితులకు అండగా..

- దాతల విరాళాల వెల్లువ
- దుస్తులు, బ్రెడ్లు, వాటర్ బాటిళ్లు పంపుతున్న వైనం

భీమవరంటౌన్, సెప్టెంబరు 14 : విజయవాడ వరద బాధితులకు దాతలందిస్తున్న సహకారం వెలకట్టలేనిదని ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు అన్నారు. భీమవరం ప్యాడీ అండ్ రైస్ మర్చంట్స్ రూ.14 లక్షలను, భీమవరం బులియన్ మర్చంట్ అసోసియేషన్, భీమవరం పాన్ బ్రోకర్స్ అసోసియేషన్, ధర్మ కాట అసోసియేషన్ సభ్యులు కలిపి రూ.4 లక్షలు చెక్కును ఎమ్మెల్యే అంజిబాబుకు అందించారు. ఫెర్టిలైజర్స్ అండ్ డీలర్స్ అసో సియేషన్స్ రూ.25 వేలు, రైస్ అండ్ ఆయిల్ మర్చంట్స్ రూ.25వేలు, ఇందుకూరి కృష్ణంరాజు రూ.25 వేలు, ఎల్ఎన్‌వీ పురానికి చెందిన చిన్నారులు గుత్తుల దేవ అభిషేక్ (1వ తరగతి), తేజ అశ్విని (4) రూ.5,300, జి.చిన్నా రూ.10 వేలు, లోసరి మాజీ సర్పంచ్ కొల్లాటి శ్రీనివాసరావు రూ.10 వేలు, లోసరికి చెందిన జి.వెంకటేశ్వరరావు రూ.10వేలు అందించారు. కోట్ల నాని, కారుమూరి సత్యనారయణమూర్తి, విజ్జురోతి రమణ, బొండాడ నాగ భూషణం, వబిలిశెట్టి రామకృష్ణ, వబిలిశెట్టి వెంకటేశ్వరావు, పొత్తూరి బాపిరాజు, కోళ్ల నాగేశ్వరరావు, భీమవరం ప్యాడీ అండ్ రైస్ మర్చంట్స్ సభ్యులు, ఫెర్టిలైజర్స్ అండ్ డీలర్స్ అసోసియేషన్ సభ్యులు, రైసెక్ అండ్ ఆయిల్ మర్చంట్స్ సభ్యులు పాల్గొన్నారు.

నియోజకవర్గం నుంచి రూ.కోటి విరాళం అందిస్తాం

వరద బాధితులకు సహాయార్థంగా భీమ వరం నియోజకవర్గం నుంచి రూ. కోటి విరాళాన్ని అందిస్తామని కేంద్ర సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మ, భీమవరం ఎమ్మెల్యే పులపర్తి అంజిబాబు అన్నారు. శనివారం ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో వారు మాట్లాడారు. ఇప్పటికే దాతలు ముందుకు వచ్చి విరాళాలు అందిస్తున్నారని, రూ.కోటి విరాళాలను సేకరించి బాధితులకు అండగా ఉంటామన్నారు. టీడీపీ రాష్ట్ర నాయకులు కోళ్ల నాగేశ్వరరావు, పొత్తూరి బాపిరాజు, వబిలిశెట్టి రామకృష్ణ పాల్గొన్నారు.


వరద బాధితుల కోసం వీఆర్‌వోకు చెక్కును అందజేస్తున్న వల్లూరు వర్తక సంఘం నాయకులు

- తణుకు : తణుకులోని టీడీపీ క్యాంపు కార్యాలయంలో పలువురు దాతలు సీఎం సహాయనిధికి చెక్కులను ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణకు అందజేశారు. పలు గ్రామాల నుంచి విరివిగా విరాళాలు అందించడం సంతోషకరమన్నారు. పలు సంస్థలు, గ్రామాల నుంచి రూ. 5 లక్షల 44 వేల 116 అందజేశారన్నారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.
- ఆచంట : వరద బాధితుల సహాయార్థం వల్లూరు వర్తకులు చాంబర్ ఆఫ్ కామర్స్ ఆధ్వర్యంలో సేకరించి రూ.27 వేలు చెక్కును వీఆర్‌వో కె. నాగేశ్వరరావుకు అందజేశారు. చాంబర్ అధ్యక్షుడు కడారి వెంకట రామకృష్ణ, ఏడిద శ్రీనివాస్, తాళం శ్రీనివాస్, రాఘవ శ్రీనివాస్, వీరాస్వామి కిరణ్, అయ్యప్ప పాల్గొన్నారు.
- పెంటపాడు, సెప్టెంబరు 14: వరద బాధితుల సహాయార్థం నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి వలవల బాబ్జి పిలుపు మేరకు పలు గ్రామాల నుంచి టీడీపీ నాయకులు విరాళాలు అందజేశారు. దర్శిపర్రు గ్రామానికి చెందిన పాలూరి భాస్కరరావు రూ. 50 వేలు, అలంపురం గ్రామ టీడీపీ నాయకులు రూ. 50 వేలు, ఉప్పరగూడెం టీడీపీ నాయకులు రూ. 55,966లు, గొల్లగూడెం నుంచి రూ. 20,100 విరాళం బాబ్జికి అందజేశారు.
- అత్తిలి : నవుడూరు గ్రామానికి చెందిన బొల్లెంపల్లి ప్రసాద్ విజయవాడ వరద బాధితుల సహాయార్థం రూ. 10 వేల డీడీని ఎమ్మెల్యే ఆరిమిల్లికి అందజేశారు. టీడీపీ మండల అధ్యక్షుడు ఆనాల ఆదినారాయణ, ఏఎంసీ మాజీ చైర్మన్ దాసం బాబ్జి, పోలిశెట్టి చంటి, అల్లి సత్యనారాయణ, బోడపాటి సూర్యచంద్రరావు పాల్గొన్నారు.

వరద బాధితులకు దుస్తులు, బ్రెడ్ల సేకరణ

భీమవరం అర్బన్, సెప్టెంబరు 14 : విజయవాడ వరద బాధితుల సహాయార్థం అల్లూరి సీతారామరాజు భగత్‌సింగ్ సేవా విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో దుస్తులు, దుప్పట్లు, బ్రెడ్స్, వాటర్ బాటిల్స్‌ను దాతల సహకారంతో సేకరించి పంపిణీ చేస్తున్నామని చైర్మన్ బి.బలరాం తెలిపారు. అభయ ఫౌండేషన్ 110 దుప్పట్లు, భూపతిరాజు సురేష్ వర్మ 250 దుప్పట్లు, పెన్నాడ గ్రామ సర్పంచ్ గొట్టుముక్కల శివాజీరాజు వెయ్యి వాటర్ బాటిల్స్, దుస్తులను అందించారన్నారు.


చినిమిల్లిపాడులోని సాయమందిస్తున్న లయన్స్ క్లబ్ సభ్యులు

వరద బాధితులకు లయన్స్ క్లబ్ సాయం

ఆకివీడురూరల్ సెప్టెంబరు 14 : చినిమిల్లిపాడులోని వరద బాధితులకు లయన్స్‌క్లబ్ ఆదర్శ వారి ఆధ్వర్యంలో సుమారు రూ.50 వేలు విలువచేసే నిత్యావసర వస్తువులు అందజేశారు. ఆదర్శక్లబ్ అధ్యక్ష కార్యదర్శులు రాజేశ్వరి, జ్యోతిరెడ్డి, నాగమణి, కృష్ణమూర్తి, చెంచయ్య, మురళీరాజు, సత్యనారాయణ, డిఎస్ఎన్, బలే వెంకటేశ్వరావు, శ్రీనివాసరాజు, షరీఫ్ తదితరులు పాల్గొన్నారు.

పునరావాసాల్లో బాధితుల వివరాలు సేకరిస్తున్నాం

ఆకివీడు, సెప్టెంబరు 14 : పునరావాసాల్లో ఉన్న వరద బాధితులకు నష్టం కల్గకుండా పకడ్బందీగా వివరాలు సేకరిస్తున్నామని తహసీల్దార్ నందూరి వెంకటేశ్వరరావు అన్నారు. శనివారం పభుత్వం నుంచి వచ్చే సాయం అందేందుకు స్థానిక జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలోని పునరావాసంలో ఉన్న వరద బాధితుల ఆధార్, రేషన్ కార్డులతో బ్యాంకుకు సంబంధించిన పత్రాలు సేకరిస్తున్నామన్నారు. రెవెన్యూ సిబ్బంది, టీడీపీ పట్టణ అధ్యక్ష-కార్యదర్శి బొల్లా వెంకట్రావు, గంధం ఉమా, మాజీ సర్పంచ్ గొంట్లా గణపతి, జాకీర్ ఉన్నారు.

ప్రాతాళ్ళమెరక బాప్టిస్ట్ సంఘం చేయూత

కాళ్ళ, సెప్టెంబరు 14 :విజయవాడ వరద బాధితులకు సాయం చేసేందుకు ప్రాతాళ్ళమెరక సీబీసీఎస్‌సీ బాప్టిస్ట్ సంఘం సభ్యులు ముందుకు వచ్చారు. నిత్యావసర వస్తువులను సమకూర్చి శనివారం విజయవాడ పంపించారు. యువకులు రెండు వ్యాన్లను ఏర్పాటు చేసుకుని విజయవాడలో రాజరాజేశ్వరి కాలనీలో సుమారు 200 మందికి నిత్యావసర వస్తువులను, కూరగాయలు, ఆహారాన్ని స్వయంగా బాధితులకు అందించేందుకు సంఘస్తులు యూత్ సభ్యులు తరలివెళ్ళారు. స్థానిక వృద్ధాశ్రమంలో వృద్ధులకు భోజనం అందించారు.

ప్రతి ఒక్కరూ హిందీ భాష నేర్చుకోవాలి

భీమవరంటౌన్/పాలకొల్లు అర్బన్/గణపవరం/పెనుగొండ, సెప్టెంబరు 14 : ప్రతి ఒక్కరూ హిందీ భాషను నేర్చుకోవాలని, హిందీ భాష నేర్చుకుంటే దేశ నలుమూలల తిరగొచ్చని ప్రముఖ హిందీ పండితురాలు తూపురాణి గోదాదేవి అన్నారు. భీమవరం చాంబర్ ఆఫ్ కామర్స్ భవనంలో హిందీ భాష దినోత్సవాన్ని పురస్కరించుకుని శ్రీవిజ్ఞానవేదిక ఆధ్వర్యంలో ప్రభుత్వ, ప్రైవేట్ హైస్కూల"లోని 20 మంది హిందీ ఉపాధ్యాయులను సత్కరించారు. నిర్వాహకులు చెరుకువాడ రంగసాయి మాట్లాడుతూ పట్టణం లోని 20 పాఠశాలల్లోని 26 మంది హిందీ ఉపాధ్యాయులకు సత్కరించామని తెలిపారు. పాకొల్లులోని బీఆర్ఎంవీఎం హైస్కూల్ హిందీ ఉపాధ్యాయులు బి.గీతనంద కుమారి ఆధ్వర్యంలో, ఇన్‌చార్జి హెచ్ఎం యు.పెద్దిరాజు అధ్యక్షతన, గణపవరం చింతలపాటి మూర్తిరాజు ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ నిర్మలకుమారి ఆధ్వర్యంలో, పెనుగొండ భాష్యం పాఠశాలలో ప్రిన్సిపాల్ ఎన్. వెంకటఅప్పారావు ఆధ్వర్యంలో హిందీ భాష దినోత్సవం ఘనంగా నిర్వహించారు. విద్యార్థులకు పోటీలు నిర్వహించి బహుమతులు అందించారు.

నేతల ఆశయాలు నెరవేర్చాలి

వీరవాసరం (భీమవరంటౌన్)/భీమవరం అర్బన్/ఆకివీడు/పెనుగొండ, సెప్టెంబరు 14 : నేతల ఆశయాలను నెరవేర్చాలని పలువురు అన్నారు. వీరవాసరంలో సీతారాం ఏచూరి, ఆర్.సత్యనారాయణలకు సీఐటీయూ ఆధ్వర్యంలో నివాళులర్పించారు. శనివారం వీరవాసరంలో వారి చిత్రపటాల వద్ద సీఐటీయూ జిల్లా నాయకులు ఎం.ఆంజనేయులు పుష్ప గుచ్ఛాలు ఉంచి శ్రద్ధాంజలి ఘటించారు. భీమవరం ఏఎస్ఆర్ నగర్‌లో మాజీ ఎమ్మెల్యే ఆర్. సత్యనారాయణరాజు కుటుంబసభ్యులను ఎమ్మెల్యే పితాని పరామర్శించారు. ఆకివీడు గాంధీజీ సెంటర్‌లో సీతారామ్ సీతారాం సంస్మ రణ సభ సీపీఎం జిల్లా సెక్రటేరియేట్ సభ్యులు జేఎన్‌వీ గోపాలన్ ఆధ్వర్యంలో నిర్వహించారు. పెనుగొండ మండలం సిద్ధాంతం రావిచెట్టు సెంటర్లఓ సీతారాం ఏచూరి చిత్రపటానికి గ్రామ శాఖ కార్యదర్శి కప్పల రత్నరాజు నివాళులు అర్పించారు.

ఎక్సైజ్ శాఖ ఏకీకరణ అభినందనీయం

తాడేపల్లిగూడెం రూరల్, సెప్టెంబరు 14: ఎక్సైజ్ శాఖ ఏకీకరణ నిర్ణయం అభినందనీయమని ఎక్సైజ్ సీఐ మద్దాల శ్రీనివాస్ పేర్కొన్నారు. గత వైసీపీ ప్రభుత్వం ప్రవేశపెట్టిన సెబ్‌ను రద్దుచేస్తూ కూటమి ప్రభుత్వం నిర్ణయం పట్ల శనివారం ఎక్సైజ్ స్టేషన్ వద్ద సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, మంత్రి రవీంద్రల చిత్రపటాలకు పాలాభిషేకం చేస్తూ తమ హర్షం తెలిపారు. ముందుగా ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ నివాసానికి వెళ్లి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్సై లక్ష్మి సిబ్బంది పాల్గొన్నారు.

రహదారి వెంబడి నివాసితులకు నోటీసులు

ఆకివీడురూరల్ సెప్టెంబరు 14 : అయిభీమవరం రహదారి వెంబడి నివసిస్తున్న 148 మందికి ఇళ్లు తొలగించాలని శనివారం సచివాలయ సిబ్బంది నోటీసులు అందజేశారు. ఆర్అండ్‌బీ అధికారులు, తహసీల్దారు ఆదేశాలు మేరకు ఈనోటీసుల పంపిణీ చేస్తున్నట్లు పంచాయతీ డీడీవో ఆనందభూషణం తెలిపారు. వీఆర్వో దానయ్య, సచివాలయ సిబ్బంది తదితరులున్నారు. ఇళ్ళు ఖాళీ చేసేందుకు గడువు అడుగుతున్నట్లుగా నోటీసులు తీసుకున్నవారు తెలియజేస్తున్నారు.

'అద్దేపల్లి' అందరికీ స్ఫూర్తిదాయకం : మంత్రి నిమ్మల


ఆర్యవైశ్య ప్రముఖులను సన్మానిస్తున్న మంత్రి నిమ్మల

పాలకొల్లు టౌన్, సెప్టెంబరు 14 : స్వాతంత్ర్య సమరయోధుడు, విద్యాదాత అద్దేపల్లి సత్యనారాయణ మూర్తి దాతృత్వ సేవలు భవిష్యత్ తరాలకు స్ఫూర్తిదాయకమని రాష్ట్ర మంత్రి నిమ్మల రామానాయుడు అన్నారు. ధర్మారావు ఫౌండేషన్ ఆధ్వర్యంలో స్థానిక అద్దేపల్లి సత్యనారాయణమూర్తి ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రాంగణంలో శనివారం నిర్వహించిన అద్దేపల్లి 125వ జయంతి వేడుకలు నిర్వహించారు. తొలుత అద్దేపల్లి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. రక్తదాన శిబిరాన్ని మంత్రి ప్రారంభించగా పలువురు యువకులు రక్తదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అద్దేపల్లి స్ఫూర్తిని తెలపాలనే ఉద్దేశంతో శతిజయంతి వేడుకలను ఏడాది పాటు నిర్వహిస్తున్నామన్నారు. కళాశాలలో పూర్వవిద్యార్థులు ఏర్పాటు చేసిన దివంగత అద్దేపల్లి విగ్రహాన్ని, అధ్యాపకులు ఏర్పాటు చేసిన సరస్వతీదేవి విగ్రహాన్ని మంత్రి నిమ్మల ప్రారంభించారు. ఆర్యవైశ్య ప్రముఖులను సన్మానం చేశారు. మాజీ ఎమ్మెల్సీ అంగర రామ్మోహన్, మాజీ ఎమ్మెల్యే బంగారు ఉషారాణి, పెచ్చెట్టి బాబు, బోనం చినబాబు, ఉన్నమట్ల కబర్ది, జీవీ, కర్నేన గౌరునాయుడు, ప్రిన్సిపాల్ పోచ మల్లేశ్వరరావు, ఆర్యవైశ్య ప్రముఖులు పాల్గొన్నారు.

హెచ్ఐవీ చిన్నారులకు పౌష్టికాహారం అందజేత

భీమవరం క్రైం, సెప్టెంబరు 14 :హెచ్ఐవీ బాధిత కుటుంబాల పిల్లలకు ప్రభుత్వ సాయంతో పాటు స్వచ్ఛంద సంస్థలు, దాతలు పౌష్టికాహారం అందించడం వల్ల ఇమ్యూనిటీ పెరుగుతుందని మమానవత సంస్థ అధ్యక్షుడు పెన్మెత్స రామ్మోహన్‌వర్మ, చైర్మన్ బుద్దరాజు వెంకటపతిరాజు, ఆర్టీసీ డిపో మేనేజర్ సత్యనారాయణమూర్తి, ఏఆర్టీ సీనియర్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ ఎంగోవిందబాబు అన్నారు. భీమవరం ప్రభుత్వాసుపత్రిలో శనివారం 30 మంది హెచ్ఐవీ బాధిత చిన్నారులకు పౌష్టికాహారం కిట్లు పంపిణీ చేశారు. సంస్థ సభ్యులు కొత్తపల్లి కోదండ రామరాజు సౌజన్యంతో బిర్యానీ ప్యాకెట్లు అందించామన్నారు. సంస్థ కో-చైర్మన్ కార్మూరి బాబు, ఏఆర్టీ వైద్యులు డాక్టర్ వి.రాంబాబు, సంస్థ ఉపాధ్యక్షులు కేవీఎస్ఎన్ రాజు, అల్లూరి నరసింహరాజు తదితరులు పాల్గొన్నారు.

నేడు చిన్నారులకు ఉచిత గుండె వైద్య శిబిరం

పెంటపాడు, సెప్టెంబరు 14: ప్రత్తిపాడు 3-ఎఫ్ స్వాభిమాన్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో హైదరాబాద్ స్టార్ ఆసుపత్రి సహకారంతో నిర్వహిస్తున్న చిన్న పిల్లల ఉచిత గుండె చికిత్స సేవలను సద్వినియోగం చేసుకోవాలని సంస్థ ప్రతినిధులు తెలిపారు. ఈనెల 15న ప్రత్తిపాడు-రాచర్ల రోడ్డులోని 3-ఎఫ్ స్వాభిమాన్ ఆశ్రమంలో ఒక నెల నుంచి 14 ఏళ్ల లోపు వారికి ఉచితంగా టూడీ ఎకో తదితర గుండె వ్యాధి పరీక్షలు నిర్వహిస్తామన్నారు. అవసరమైన వారికి ఫౌండేషన్ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో ఉచితంగా చికిత్స, చికిత్స, ప్రయాణ ఖర్చులు ఫౌండేషనే భరిస్తుందన్నారు. మరిన్ని వివరాలకు జి.శ్రీనివాసరెడ్డి 99496 49519, గణేష్ 63042 40277లను సంప్రదించాలని కోరారు.

జాతీయ లోక్ అదాలత్‌లో 416 కేసుల రాజీ

భీమవరం క్రైం/తణుకు/నరసాపురం, సెప్టెంబరు 14 :జిల్లాలోని భీమవరం, తణుకు, నరసాపురం పట్టణాల్లో శనివారం నిర్వమించిన జాతీయ లోక్ అదాలత్‌లో మొత్తం 416 కేసులు రాజీ చేసినట్టు న్యాయమూర్తులు తెలిపారు. భీమవరం మండలంలో న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో భీమవరం పట్టణం, పాలకోడేరు, కాళ్ళ, ఉండి, ఆకివీడు, వీరవాసరం పోలీస్‌స్టేషన్‌ల పరిధిలోని నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్‌లో 159 కేసులు రాజీ చేసినట్టు న్యాయమూర్తులు తెలిపారు. సుమారు ఒక కోటి 80 లక్షలు రూపాయలు వసూలు అయ్యాయని తెలిపారు. తణుకు కోర్టుల సముదాయంలో నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్‌లో 123 కేసులు రాజీ చేశామని నాలుగో అదనపు జిల్లా న్యాయాధికారి డి.. సత్యవతి తెలిపారు. నరసాపురం కోర్టు ప్రాంగణంలో శనివారం నిర్వహించిన లోక్ అదాలత్‌లో 134 కేసులు పరిష్కరించినట్టు న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ పదో అదనపు జిల్లా జడ్జి పి.విజయదుర్గ తెలిపారు.

దివ్యాంగురాలిపై దాడికి పాల్పడిన వారిని శిక్షించాలి

నరసాపురం రూరల్, సెప్టెంబరు 14: మల్లవరలంక గ్రామంలో రెండు రోజుల క్రితం కె.విజయనిర్మల అనే దివ్యాంగురాలిపై దాడికి పాల్పడిన నిందితులను శిక్షించాలని శనివారం మదర్ థెరిస్సా దివ్యాంగుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఆందోళన చేపట్టారు. ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతున్న విజయనిర్మలను పరామర్శించి అక్కడ నుంచి మోటారు సైకిల్ ర్యాలీ నిర్వహించారు. రూరల్ పోలీస్‌స్టేషన్ వద్దకు చేరుకుని నిరసన తెలిపారు. నిందితులపై పెట్టిన సెక్షన్లు మార్పు చేసి కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. స్టేషన్ సిబ్బందికి వినతిపత్రం అందించారు. సంఘం నాయకులు చిక్కాల వాసు, గుత్తుల వాసు, బొమ్మిడి అప్పారావు, లక్ష్మణరావు పాల్గొన్నారు.

గోశాలకు విద్యుత్ పరికరాలు బహూకరణ

పాలకొల్లు అర్బన్, సెప్టెంబరు 14 :క్షీరా రామలింగేశ్వర స్వామి దేవస్థానంకు చెందిన గోశాలకు అవసరమైన విద్యుత్ పరికరాలను గణేష్ ఎలక్ట్రికల్స్, ప్లంబింగ్, శానటరీ అధినేత శ్రీభరత్ ప్రజాపతి అదజేశారు. సుమారు రూ.25వేలు విలువైన విద్యుత్ పరికరాలు అందించారు. దాతను ఈవో శ్రీనివాసరావు, సూపరింటెండెంట్ స్వామి సత్కరించి, స్వామివారి శేష వస్త్రాలను అందించారు.


తాడేపల్లిగూడెంలో వలవల బాబ్జి పూజలు

గణనాథుడికి పూజలు

తాడేపల్లిగూడెం అర్బన్, సెప్టెంబరు 14: వినాయక చవితి ఉత్సవాల్లో భాగంగా పట్టణంలో శనివారం నిర్వహించిన పలు వినాయక ఊరేగింపులు, అన్నసమారాధన కార్యక్రమాల్లో టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి వలవల బాబ్జి పాల్గొని స్వామివారికి పూజలు చేశారు. గొర్రెల శ్రీధర్, పట్నాల రాంపండు, కిలపర్తి వెంకట్రావు పాల్గొన్నారు.

- అత్తిలి : అత్తిలి వంతెన వద్ద గల వర సిద్ధి వినాయకుడిని ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ దర్శించుకుని పూజలు నిర్వహించారు. పూజల అనంతరం ఆయనను కమిటీ నాయకులు సత్కరించారు. అనంతరం అత్తిలి బస్టాండ్ సమీపంలో గల నాగమ్మ ఆలయంలో పూజలు చేశారు.
- ఆకివీడు, సెప్టెంబరు 14 : ఆకివీడు లాంచీలరేవు దగ్గర శ్రీభక్తాంజనేయ చేపల కమీషన్ వర్తక సంఘం ఆధ్వర్యంలో వినాయక చవితి ఉత్సవాలు ముగింపు సందర్భంగా శనివారం అన్నసమారాధన నిర్వహించారు. సంఘ అధ్యక్షుడు షేక్ సుభానీ, ఉపాధ్యక్షుడు కోయ దొరబాబు, సహాయ కార్యదర్శి కేశిరెడ్డి శ్రీను, వార్డు కౌన్సిలర్ పడాల శ్రీనివాసరెడ్డి తదితరులు ఉన్నారు.


అన్నసమారాధనలో శ్రీభక్తాంజనేయ చేపల కమీషన్ వర్తక సంఘం ప్రతినిధులు

వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఊంజల్ సేవ

భీమవరంటౌన్, సెప్టెంబరు 14 : భాద్రపద మాసం శనివారం పురస్కరించుకుని జువ్వలపాలెం రోడ్డులోని పద్మావతి వేంకటేశ్వరస్వామి ఆలయంలో స్వామి, పద్మావతి అమ్మవారికి ఊంజల్ సేవ నిర్వహించారు. అర్చకుడు వాడపల్లి ఆదినారాయణాచార్యులు ఆధ్వర్యంలో స్వామికి విశేష పూజలు నిర్వహించిన అనంతరం దీపాలంకరణతో ప్రత్యేకంగా అలంకరించిన ఉయ్యాలలో సేవను నిర్వహించారు. ఆలయ ఈవో ఆర్.గంగాశ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

అష్టభుజ లక్ష్మీనారాయణ స్వామికి ప్రత్యేక పూజలు



పాలకొల్లు అర్బన్, సెప్టెంబరు 14 :స్థానిక శ్రీఅష్టభుజ లక్ష్మీనారాయణ స్వామి ఆలయంలో జరుగుతున్న పవిత్రోత్సవాలు రెండో రోజు శుక్రవారం స్వామిని ప్రత్యేకంగా శ్రీభూ వరాహస్వామిగా అలంకరించి, పూజలు చేశారు. ఆళ్వార్లను ప్రత్యేకంగా అలంకరించారు. కార్యక్రమాలను అర్చకులు పండితులు శ్రీలక్ష్మీనృసింహహవనం గావించారు. భక్తులకు ప్రసాద వినియోగం గావించారు. ఈవో బీవీవీ సత్యనారాయణ శంకర్, సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు. సాయంత్రం స్వామిని ప్రత్యేకంగా అలంకరించిన గరుడ వాహనంలో ఉరేగించారు.

- కాళ్ల/మొగల్తూరు : గణపతి నవరాత్రి వేడుకలలో భాగంగా శనివారం కాళ్ల మండలంలోని పలు గ్రామాలలో ఏర్పాటు చేసిన గణనాథుల విగ్రహాలను యువకులు ఉత్సాహంగా నిమజ్జనాలు చేసి అన్నసమారాధనలు నిర్వహించారు. మొగల్తూరు మండలం మొగల్తూరులోని కుక్కలవారితోటలో చిన్న పిల్లలు నిర్వహించిన వినాయక వేడుకలు ముగింపు సందర్భంగా నిర్వహించిన అన్నసమారాధనలో భక్తులు పాల్గొని ప్రసాదాలు స్వీకరించారు.